




# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 06-07-2021 | VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 253 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## తెలంగాణ అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తోంది

### కేంద్రమంత్రులు షెకావత్, ప్రకాష్ జవదేకర్‌కు సీఎం జగన్ లేఖ



అమరావతి : కేంద్రమంత్రులు గజేంద్ర షెకావత్, ప్రకాష్ జవదేకర్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేర్వేరుగా లేఖలు రాశారు. తెలంగాణ అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తోందంటూ మరోసారి సీఎం వైఎస్ జగన్ ఫిర్యాదు చేశారు. తెలంగాణలో నిర్మాణంలో ఉన్న అక్రమ ప్రాజెక్టులను సందర్శించాకే.. రాయలసీమ లిఫ్ట్ సందర్శించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ని ఆదేశించాలని సీఎం వైఎస్ జగన్ కోరారు.

**కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర షెకావత్‌కు సీఎం జగన్ లేఖ**

నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని.. కేటాయింపుల కంటే ఎక్కువ నీటిని వినియోగిస్తోందని సీఎం జగన్ లేఖలో పేర్కొన్నారు. "శ్రీశైలం ప్రాజెక్టులో నీటినిల్వలు ఉండకుండా తెలంగాణ అక్రమంగా నీటిని తోడేస్తోంది. ఈనెల 1 నుంచి ఇప్పటి వరకు 19 టీఎంసీల నీటిని వినియోగించుకుంది. 796 అడుగుల నీటిమట్టం నుంచి తెలంగాణ నీటిని తోడేస్తోందని" సీఎం వైఎస్ జగన్ లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను పట్టించుకోకుండా రాయలసీమ లిఫ్ట్‌ను పరిశీలిస్తామని పదేపదే కేఆర్ఎంబీ కోరుతోంది. తెలంగాణలో నిర్మాణంలో ఉన్న అక్రమ ప్రాజెక్టులను సందర్శించాకే రాయలసీమ లిఫ్ట్ సందర్శించేలా కేఆర్ఎంబీని ఆదేశించాలని సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ పాలమూరు-రంగారెడ్డి, దిండి, కల్వకుర్తి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోందని, కేంద్ర జలశక్తి, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అనేక ఫిర్యాదులు చేసినా సరైన చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఏపీ పట్ల కేఆర్ఎంబీ వివక్షతో వ్యవహరిస్తోందని, తెలంగాణ తప్పుడు ఫిర్యాదుల పట్ల మాత్రం కేఆర్ఎంబీ వేగంగా స్పందిస్తోందన్నారు. ఏపీ ఇచ్చిన ధర్మబద్ధమైన ఫిర్యాదులను కేఆర్ఎంబీ పట్టించుకోవడంలేదని సీఎం వైఎస్ జగన్ లేఖలో పేర్కొన్నారు.

"శ్రీశైలంలో 854 అడుగుల నీరు లేకుంటే కరువు ప్రాంతమైన రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు అందించే అవకాశం లేదు.

పాలమూరు రంగారెడ్డి, దిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను 800 అడుగుల వద్ద పర్యావరణ అనుమతి లేకుండా తెలంగాణ నిర్మిస్తోంది. ఈ అక్రమ ప్రాజెక్టు వల్ల శ్రీశైలంలో 854 అడుగుల నీరు ఉండే అవకాశాలు లేవని" సీఎం వైఎస్ జగన్ లేఖలో పేర్కొన్నారు.

**కేంద్రమంత్రి ప్రకాష్ జవదేకర్‌కు సీఎం వైఎస్ జగన్ లేఖ**

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు పర్యావరణ అనుమతి ఇవ్వాలని కేంద్రమంత్రి ప్రకాష్ జవదేకర్‌కు రాసిన లేఖలో సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు.

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ నిబంధనలకు విరుద్ధంగా కృష్ణా ప్రాజెక్టుల్లో తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తోందని లేఖలో పేర్కొన్నారు. "జూన్ 1 నుంచి విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. నాగార్జునసాగర్, కృష్ణా డెల్టా పరిధిలో ఇరిగేషన్ అవసరాలు విద్యుత్ ఉత్పత్తి కోసమే ఇప్పటి వరకు 19 టీఎంసీల నీటిని వినియోగించింది. 854 అడుగులకు చేరితే గానీ పోతిరెడ్డిపాడుకు నీటిని తీసుకునే అవకాశం లేదని" లేఖలో సీఎం జగన్ పేర్కొన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ఇప్పటికే కేంద్ర జలవనరుల కమిషనర్‌కు పూర్తి డీపీఆర్‌ను అందజేశామని.. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని లేఖలో సీఎం జగన్ పేర్కొన్నారు.

### పరిశుభ్రతే లక్ష్యంగా ఆగష్టు 15 నుండి

## క్లాప్ కార్యక్రమం

- అన్ని పట్టణాల్లో వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు
- ఆస్తిపన్ను పెంపు 15శాతం మించకూడదని నిబంధన
- అపోహలు తొలగించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం
- తుదిదశలో అమరావతి భూములపై విచారణ
- తెలంగాణ ప్రభుత్వం నీటివినియోగంపై మానవతా దృక్పథంతో ఆలోచించాలి
- పొరుగు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వుండాలి
- సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలి
- పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



విజయనగరం : పరిశుభ్రమైన రాష్ట్రంగా, పరిశుభ్రతలో దేశంలోనే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి సంకల్పమని, ఈ లక్ష్యాన్ని చేరుకొనే దిశగా క్లాప్(క్లీన్ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమం ఆగష్టు 15 నుంచి చేపడుతున్నట్టు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. వచ్చే ఏడాది ఆగష్టు నాటికి రాష్ట్రంలో తరువాయి 2లో..

### సింహాచలం భూముల అక్రమాలపై

## విచారణ కమిటీ ఏర్పాటు



విశాఖపట్నం: సింహాచలం దేవస్థానం, మాన్సాస్ ట్రస్ట్ భూముల వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూముల వ్యవహారంలో విచారణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అడిషనల్ కమిషనర్ చంద్ర కుమార్, డిప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్‌లతో కమిటీని నియమించింది. ఈనెల 15లోగా ప్రాథమిక నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. మాజీ ఈవో రామచంద్రమోహన్ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అశోక్ గజపతిరాజు చైర్మన్‌గా ఉన్న కాలంలో ఈవోగా రామచంద్రమోహన్ పనిచేశారు. మాన్సాస్ భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు దేవాదాయ శాఖ గుర్తించింది. సింహాచలం దేవస్థానం భూములను 22 ఏ జాబితా నుండి చట్టవిరుద్ధంగా తొలగించారనే అభియోగాలు ఉన్నాయి.

## కోవిడ్ నివారణ చర్యలపై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి: కోవిడ్ నివారణ చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష చేపట్టారు. కోవిడ్ కేసుల నమోదు, లాక్‌డౌన్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, కోవిడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. " వ్యాక్సినేషన్‌పై మరింత ధ్యాస పెట్టాలి. ఐదేళ్లలోపు పిల్లల తల్లులకు ఇప్పటికే వ్యాక్సినేషన్ ఇస్తున్నాం. ఐదేళ్లు దాటిన పిల్లలున్న తల్లులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. గర్భిణీలు, ఉపాధ్యాయులకూ వ్యాక్సినేషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి. రెండు నెలల్లోగా ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ల పనులు పూర్తి చేయాలి" అని అధికారులను ఆదేశించారు.

## ఏపీలో కర్ఫ్యూ సడలింపుల్లో మార్పులు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్ఫ్యూ సడలింపుల్లో పలు మార్పులు ప్రకటించింది. తాజా నిబంధనల ప్రకారం.. ఉభయ గోదావరి జిల్లాల్లో ఉదయం 6 నుంచి రాత్రి 7 వరకు సడలింపు ఉంటుంది. సాయంత్రం 6 గంటలకే దుకాణాలు మూసివేయాల్సి ఉంటుంది. ఇక మిగిలిన 11 జిల్లాల్లో ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు సడలింపునిచ్చిన ప్రభుత్వం.. ఆయాచోట్ల రాత్రి 9 గంటలకే దుకాణాలు మూసివేయాలని స్పష్టం చేసింది.

అదే విధంగా.. రాష్ట్రంలో సినిమా థియేటర్లు తెరిచేందుకు అనుమతినిచ్చింది. అయితే, సీటుకు సీటుకు మధ్య గ్యాప్ ఉండాలని ఆంక్షలు విధించింది. ఇక కోవిడ్ ప్రొటోకాల్స్‌తో రెస్టారెంట్లు, జిమ్స్, కల్యాణ మండపాలకు అనుమతినిచ్చిన ప్రభుత్వం... శానిటైజర్, మాస్క్ ధరించడం, భౌతికదూరం పాటించడం తప్పని సరి అని పునరుద్ఘాటించింది.

## రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు

విశాఖపట్నం: ఉత్తర భారతదేశంలో హిమాలయ ప్రాంతాన్ని ఆనుకొని ఏర్పడిన రుతుపవన ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఈ కారణంగా రానున్న రెండు రోజుల పాటు దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయని వెల్లడించారు.

ఇదిలా ఉండగా.. ఈ నెల రెండు లేదా మూడో వారంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే సూచనలున్నాయనీ, ఈ అల్పపీడనం ఏర్పడితే రాష్ట్రంలో వర్షాలు ఊపందుకోనున్నాయని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. పలుచోట్ల గంటకు 45 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచాయి. వేపాడలో 9.3 సెం.మీ. వర్షపాతం నమోదుకాగా, ఆనందపురంలో 8.8, కె.కోటపాడులో 7.2, సంతబొమ్మాళిలో 7.1, యర్రగొండపాలెంలో 6.3, మందసలో 5.9, అనంతగిరిలో 5.9, విశాఖపట్నంలో 5.8, ఎస్.కోటలో 5.7, కోయిలకుంట్లలో 5.2, డెంకాడ, సోంపేటలలో 5, కొరిశపాడులో 4.8, రామభద్రాపురం, మార్కాపురంలలో 4.7, నిడదవోలులో 4.6, గుండ్లకుంటలో 4.5 సెం.మీల వర్షపాతం నమోదైంది.

## ఏపీలో క్రమంగా తగ్గుతున్న కరోనా కేసులు..




అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు క్రమంగా తగ్గుతున్నాయి. గత వారం రోజులుగా రోజువారీ కేసుల సంఖ్య క్రమంగా తగ్గడంతోపాటు, రికవరీల రేటు పెరుగుతుంది. గడిచిన 24 గంటల్లో ఏపీలో 72,731 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 2,100 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. గత 24 గంటలలో కరోనా బారిన పడి 26 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 12,870 కు చేరింది. గడిచిన 24 గంటల్లో 3,435 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటి వరకు 18 లక్షల 58 వేల 189 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సోమవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 33,964 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 1,90,5023 కు చేరింది. రాష్ట్రంలో నేటి వరకు 2,24,35,809 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ కౌంటింగ్‌పై ఏపీ హైకోర్టులో పిటిషన్లు




అమరావతి : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ జరపాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. కేసు విచారణలో తమను కూడా ఇంప్లీడ్ చేయాలని కోరారు. కోర్టు దీనిపై తదుపరి విచారణ ఈనెల 27కి వాయిదా వేసింది.




# రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ సేవలు శ్లాఘనీయం

## - శాసన మండలి సభ్యులు మాధవ్



విశాఖపట్నం : రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ - 3020 గవర్నర్ ఎం.రామారావు 2021-22 సంవత్సరానికి రోటేరియన్ డి.విశేశ్వర వర్మ చే రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు ప్రమాణ స్వీకరణ హొటల్ దసపల్లా లో చేయించారు. రోటేరియన్ కె మారుతిని క్లబ్ కార్యదర్శి గా ఇతరులను బోర్డు డైరెక్టర్ల గా ప్రతిజ్ఞ చేయించారు. శాసన మండలి సభ్యులు పి వి ఎన్ మాధవ్ ముఖ్య అతిధి గా జూమ్ మాద్య మం ద్వారా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రోటరీ కోవిడ్ సమయం సమాజానికి ఎనలేని సేవలు చేశారని అన్నారు. ప్లాస్మా, రక్తదానం లేను ముందుండి సేవలు చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా 6 మంది కొత్త సభ్యులు క్లబ్‌లో చేర్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రోటరీ అంతర్జాతీయ జిల్లా -3020 గవర్నర్ ఎం రామారావు ను సత్కరించారు. తదనంతరం జిల్లా గవర్నర్ మాట్లాడుతూ రోటరీక్లబ్ విశాఖ పోర్టు సిటి విశాఖలో నున్న క్లబ్ లలో అత్యంత శక్తివంతమైన క్లబ్ అని ప్రశంసించారు మరియు క్లబ్ కు రోటరీ జిల్లా -3020 లో దీనికి ప్రత్యేకత ఉందని అన్నారు.అనంతరం డి.వి . వర్మ మాట్లాడుతూ రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ 1995 సంవత్సరంలో 81 మంది సభ్యులతో ప్రారం భించ బడి ప్రస్తుతం 127 మంది సభ్యులు కలిగి ఉన్నామని అన్నారు. క్లబ్ ప్రారంభం నుండి అన్ని సేవా రంగాలలో చాలా చురుకుగా ఉంది అని అన్నారు.అనేక కమ్యూనిటీ సేవా ప్రాజెక్టులు క్లబ్ చేపట్టింది. వివిధ ఆస్పత్రులు, కమ్యూనిటీ సెంటర్లలో ఆర్ఓ వాటర్ ప్లాంట్లు లను ఏర్పాటు చేశారు. క్లబ్ అధునాతన బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించి 24%ఇ%7 ప్రాతిపదికన సేవలు అందిస్తోందని అన్నారు.రోటరీ గ్లోబల్ గ్రాంట్ సహాయంతో మేము హొమి బాబా క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ కోసం క్యాన్సర్ పరికరాలను విరాళంగా ఇచ్చాము.క్రమం తప్పకుండా బ్లడ్ బ్యాంకు ద్వారా రక్తదాన శిబిరాలను నిర్వహిం చడం మరియు కోవిడ్-19 లో విలువైన ప్రాణాలను కాపాడగలిగింది అని అన్నారు.

# విశాఖ జీవిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని మర్యాదపూర్వకంగా కలిసిన కటుమూరి సతీష్



అక్కయ్యపాలెం : విశాఖ జీవీఎంసీ మేయర్ ఛాంబర్ లో విశాఖ మహా నగర పాలక సంస్థ మేయర్ గోలగాని హరి వెంకట కుమారి ని మర్యాదపూర్వకంగా కలిసిన జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్. పలు సమస్యలపై చర్చించి విశాఖను అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు.

# ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

*- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన వర్సిటీ అధికారులు*

*- 99 శాతం విద్యార్థులు హాజరు*



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలో ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం మెదటి సెమిష్టర్, ఆర్కిటెక్చర్ ఐదో సంవత్సరం మెదటి సెమిష్టర్ పరీక్షలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. వర్సిటీతో పాటు, అనుబంధ కళాశాలలల్లో కేటాయించిన పరీక్ష కేంద్రాలలో వీటిని ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద, పరీక్ష కేంద్రాలలో కోవిడ్ నిబంధనలు కచ్చితంగా అమలు చేశారు. విద్యార్థులు మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం, శానిటైజర్ వినియోగించే విధంగా చర్యలు తీసుకున్నారు. వర్సిటీలో పలు పరీక్ష కేంద్రాలను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్‌లు ఉదయం పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు స్వయంగా వివరించారు. పరీక్షలకు 99 శాతం మంది విద్యార్థులు హాజరు కావడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడం పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలు ప్రశాతంగా, పటిష్టంగా నిర్వహించాలని సూచించారు.

# నూతన సబ్ - కలెక్టర్ గా అభిషేక్



పాడేరు. : పాడేరుసబ్ కలెక్టర్'గావి అభిషేక్(ఐఎఎస్) నియమితులయ్యారు.ఈసందర్భంగాఆయనసోమవారంపాడేరుచేర ుకుని నేరుగా స్థానికఉత్తరాంధ్రఆరాధ్యదైవం శ్రీశ్రీశ్రీమోదకొండ మ్మనుదర్శించు కున్నారు. అనంతరం సబ్ లెక్టర్ కార్యాలయంలో చేరుకొని(ఆర్.డి .ఓ)లక్ష్మిశివజ్యోతి నుండి సబ్ కలెక్టర్ వి.అభిషేక్ (ఐ ఏ ఎస్) బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ట్రైనింగ్'నబ్కలెక్టర్'గాప్రకాశండివిజన్లో' పూర్తిచేశాన్నాని.మొట్టమొదటిపోస్టింగ్'విశాఖఏజెన్సీపాడేరులోరావడ ందేవుడిచ్చినవరంగాభావిస్తున్నానని. ఈ ప్రకృతిఅందాలను చూసితరించిపోయాన్నానిఅన్నారు . గిరిజనులకు సేవచేసేభాగ్యం నాకు కలిగినందుకుచాలాఆనందంగాఉందాని ఆయన అభిప్రాయా న్ని వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలోస్థానికతాహశిల్దార్'ప్రకాష్,రావు తదితరులు పాల్గొన్నారు.

# 70వ వార్డులో పర్యటించిన జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

గాజువాక: జీవీఎంసీ 70 వార్డులో జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పర్యటించారు. వార్డు వైకాపా కార్పొరేటర్ ఉరుకూటి చందు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ పర్యటనలో జివిఎంసి కమిషనర్ సృజన ,గాజువాక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి ,జోనల్ కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా చట్టివాని పాలెం, డ్రైవర్స్ కాలనీ,ఎర్రగడ్డ కాలనీ,ఎల్ బి ఎస్ నగర్, పంతులు గారి మేడ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు మేయర్ గారి దృష్టికి పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా హైవే పై పంతులుగారి మేడ నుండి పంజాబీ డాబా వరకు సర్వీస్ రోడ్డు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కావున వెంటనే సర్వీస్ రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

చట్టివాని పాలెం లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని వెంటనే రిపేర్లు చేయాలని,చట్టి వాని పాలెంలో నూకాలమ్మ తల్లి గుడి దగ్గర ఉన్న ఖాళీ ప్రదేశాన్ని పార్క్ గా తయారు చేయాలని కోరారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు మధ్యలో నిలిచిపోయి రోడ్లు గోతులు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డులో పైప్ లైన్లు దశమి కొండ,చిట్టి నాయుడు కాలనీ,ఎర్రగడ్డ కాలన,శ్రామిక నగర్,శ్రీనివాస నగర్ ప్రాంతాలలో పైప్ లైన్లు కెపాసిటీ పెంచి ఇంటర్ కనెక్షన్లు ఇచ్చినట్లయితే వాటర్ సప్లై లో ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయని వెంటనే ఆ విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పందుల సమస్య చాలా అధికంగా ఉందని స్పెషల్ డ్రైవ్ చేపట్టి వెంటనే సమస్యను తీర్చాలని కోరారు.

ఈ సమస్యల అన్నిటి పట్ల మేయర్ సానుకూలంగా స్పందించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు చందు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజనీరింగ్,టౌన్ ప్లానింగ్,వాటర్ శానిటేషన్ అధికారులు, సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం

## -ప్రైవేటు సంస్థల సహకారం ముదావహం - 2.2 కోట్లతో వర్సిటీ భవనం నిర్మించనున్న ఎంఇఐఎల్ సంస్థ




ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి నూతనంగా 2.2 కోట్లు వ్యయంతో మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(ఎంఇఐఎల్) సంస్థ నూతన భవనాన్ని నిర్మించి ఇవ్వనుంది. దీనికి సంబంధించిన పనులను సోమవారం ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ప్రతీ విభాగంలో అవసరమైన మౌళిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా సామాజిక బాధ్యతగా(సిఎస్ఆర్)లో ఎంఇఐఎల్ సంస్థ 2.2 కోట్లు వ్యయంతో 9600 చదరపు అడుగుల విస్తీర్ణంలో విభాగానికి అదనపు అంతస్థును నిర్మించి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా ఇటువంటి కార్యక్రమాలు నిలుస్తాయన్నారు. భవన నిర్మాణం చేపట్టే విధానం, ప్లాన్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మేఘా సంస్థ ఎండి పి.వి సుధా క్రిష్ణ రెడ్డిని వర్సిటీ తరపున అభినందించారు. ఉదారంగా వర్సిటీకి సహకారం అందించడం ముదావహమన్నారు.

కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య జి.వి శివ క్రిష్ణారావు, చీఫ్ ఇంజనీర్ ఆర్.శంకర రావు, మేఘా సంస్థ ప్రతినిధులు విభాగ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# పరిశుభ్రతే లక్ష్యంగా ఆగష్టు 15 నుండి క్లాప్ కార్యక్రమం



ఒక మార్పును తీసుకువచ్చి రాష్ట్రాన్ని చెత్తరహితంగా, అన్ని ప్రాంతాలు అత్యంత పరిశుభ్రంగా రూపొందించాలన్నది లక్ష్యమని వెల్లడించారు. దీనిలో భాగంగా పట్టణాల్లో సేకరించిన చెత్త, వ్యర్థాలను ప్రాసెస్ చేసి మెన్యూర్, భవన నిర్మాణాలకు ఉపయోగపడే నిర్మాణ సామాగ్రిని రూపొందించేలా రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో క్లాప్ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల నుంచి చెత్త, వ్యర్థాల సేకరణకు 4500 నుంచి 5 వేల వాహనాలు సమకూరుస్తున్నట్టు చెప్పారు. క్లాప్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి మూడు చెత్తవేసుకొనే బుట్టలు అందిస్తున్నామని,, తడి, పొడి చెత్తలతో పాటు ప్రమాదకారకమైన వ్యర్థాలను వేసేందుకు మరో బుట్ట అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ బుట్టల్లో వేసే చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది ప్రతి ఇంటికి ఉదయాన్నే వెళ్లి సేకరించి వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలిస్తారని చెప్పారు. విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయ భవనంలో కొత్తగా నిర్మించిన రెండు, మూడో అంతస్థులను పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. రూ.1.48 కోట్లతో నిర్మించిన ఈ భవనాల్లో మేయర్, కమిషనర్ ఛాంబర్లు, మునిసిపల్ కౌన్సిల్ హాలు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, ఎం.ఎల్.సి. సురేష్‌బాబు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్ లాల్ తదితరులతో కలసి నూతన కౌన్సిల్ హాలులో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం నిర్మించిన కౌన్సిల్ హాలు చిన్నదిగా ఉన్నదని, ఇది నేటి కార్పొరేషన్ అవసరాలకు సరిపడే రీతిలో లేదని అందువల్ల కింది అంతస్థులో కౌన్సిల్ హాలు విశాలంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు



అందజేయాలని మునిసిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు.

### ప్రజలకు సేవలందించి మంచి పేరు తెచ్చుకోండి

నూతనంగా పాలకవర్గ ప్రతినిధులుగా ఎన్నికైన వారంతా ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా, వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే విధంగా పనిచేయాలని మంత్రి సూచించారు. తమను ఎన్నుకున్న ప్రజలకు మంచి సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రతి రోజూ ఉదయాన్నే వార్డుల్లోకి వెళ్లి తాగునీరు, పారిశుధ్ధ్యం, ఇతర ప్రజావసరాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. రోజూ కనీసం రెండు గంటలపాటు వార్డు పర్యటనలకు కార్పొరేటర్లు సమయం కేటాయించాలన్నారు. ప్రజల నుంచి సేకరించిన సలహాలు, సూచనలు తమకు తెలియజేస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని కష్టపడి పనిచేయాలని కోరారు.

### ఆస్తిపన్ను నూతన విధానంపై అవగాహన సదస్సులు

దేశంలోని పలు రాష్ట్రాల్లో విధిస్తున్న ఆస్తి పన్ను విధానాలు అధ్యయనం చేసిన తర్వాతే మన రాష్ట్రంలో ఆస్తివిలువ ఆధారంగా పన్ను విధించే విధానాన్ని ప్రవేశపెట్టామని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి పలు రాష్ట్రాల్లో అధికారుల బృందం అధ్యయనం చేసిన తర్వాతే పన్ను విధానంలో మార్పులు చేశామన్నారు. గతంలో ఉన్న ఆస్తిపన్ను విధానం లోపభూయిష్టంగా ఉన్న కారణంగానే అందరికీ సమన్యాయం చేసే ఉద్దేశ్యంతో కొత్త విధానాన్ని తీసుకువచ్చామన్నారు. దళారుల ప్రమేయం లేకుండా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా వుండేలా కొత్త పన్ను విధానాన్ని తీసుకువచ్చామన్నారు. నూతన విధానంలో కేవలం ఏదైనా స్థలంలో నిర్మించిన కట్టడం వున్న ప్రాంతానికే(ప్లింత్ ఏరియా) పన్ను విధిస్తారని, ఖాళీ స్థలంపై పన్ను ఉండదని చెప్పారు. అన్ని మునిసిపాలిటీలు, నగర పాలకసంస్థల్లో కొత్త పన్నువిధానంపై పాలకవర్గ ప్రతినిధులకు అవగాహన కల్పించి అపోహలు తొలగించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఆస్తిపన్ను అసాధారణ స్థాయిలో పెరిగే అవకాశమే లేదని, గతంలో విధించిన పన్నుపై 15శాతంకు మించి పెరుగుదల ఉండకూడదని నిబంధన విధించామన్నారు. 375 చదరపు అడుగుల విస్తీర్ణంకంటే లోపు వున్న ఇళ్లపై కేవలం రూ.50 మాత్రమే పన్ను విధించాలని నిర్ణయించామన్నారు. ఏ వర్గానికి ఇబ్బందిలేకుండా వుండేలా పన్ను విధానాన్ని రూపొందించామన్నారు.

### సుందర పట్టణంగా తీర్చిదిద్దుతాం

విజయనగరం జిల్లా కేంద్రాన్ని సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దడంలో అందరి సహకారం అవసరమని మంత్రి బొత్స పేర్కొన్నారు. నగరానికి మాస్టర్ ప్లాన్ సిద్ధమయ్యిందని దీనిని ప్రజల్లో పెట్టి అన్ని వర్గాల నుంచి దీనిపై సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. అందరి సూచనలు స్వీకరించాక వాటిని అందులో పొందుపరిచి తుదిరూపు ఇస్తామన్నారు. తారకరామ తీర్థసాగరం పూర్తయితే నగరానికి తాగునీటి సమస్య తీరుతుందని, అది త్వరగా పూర్తవుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఈలోగా నగరంలో నీటి సమస్యలేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

### అమరావతి భూములపై తుదిదశకు చేరిన విచారణ

అమరావతి భూముల అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని, ఈ విచారణ తుదిదశకు చేరిందన్నారు. అక్రమాలపై చర్యలు తీసుకొనే సమయంలో సాంకేతిక అంశాలను అడ్డుపెట్టుకొని కోర్టుల నుంచి స్టే తెచ్చుకున్నారని మంత్రి చెప్పారు. అమరావతి భూముల విషయంలో తప్పు జరిగిందని, బలహీనవర్గాల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారని, ఇది వాస్తవమని మంత్రి పేర్కొన్నారు.

### తెలంగాణ ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించాలి

కృష్ణా జలాలు సముద్రంలోకి వృథాగా పోకుండా రైతాంగానికి ఉపయోగపడేలా వినియోగించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. తెలంగాణతో కృష్ణా జలాల సమస్యల సామరస్యంగా పరిష్కారం కావాలని, ఇరుగుపొరుగు రాష్ట్రాలతో ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో తమ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అక్కడి ప్రభుత్వం కూడా ఇదే విధానంతో వుండాలన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ట్రిబ్యునల్స్, చట్టాలు ఉన్నాయని వాటికి అనుగుణంగా పరిష్కరించుకొనేందుకు ముందుకు రావాలన్నారు. నదీజలాలపై మన రాష్ట్రానికి ఉన్న న్యాయమైన హక్కులను వదులుకునే ప్రశ్నే లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం మనసు మార్చుకొని విద్యుత్ ఉత్పత్తి కోసం నీటి వినియోగాన్ని ఆపాలని కోరారు.

ఈ కార్యక్రమం లో శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ మునిసిపల్ కార్యాలయం ఇరుకుగా ఉండి పలు విభాగాలు కార్యాలయానికి వెలుపల ఉన్న కారణంగా గతంలో ఇబ్బందులు తలెత్తేవని, ఇప్పుడు నిర్మించిన భవనాల కారణంగా ఆ కొరత తీరుతుందన్నారు. గత రెండేళ్లలో మూడు వందలకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు ఆ పనులన్నీ పూర్తిచేస్తున్నామని చెప్పారు. నగరం అభివృద్ధికి మునిసిపల్ మంత్రి సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్, ఎం.ఎల్.సి. సురేష్‌బాబు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్ లాల్, మునిసిపల్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, ఆర్.డి.ఓ. భవానీ శంకర్, మునిసిపల్ ఇంజనీర్ కె.దిలీప్, కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

## హుకుంపేటలో షాప్ కూల్చివేతను నిరసిస్తూ దీక్ష ప్రారంభం



పాడేరు (హుకుంపేట మండలం) : మండల కేంద్రంలో ఆదివాసి మహిళా షాప్ కూల్చివేతను నిరసిస్తూ సోమవారం హుకుం పేట లో దీక్షలు ప్రారంభించిన సిపిఎం పార్టీ మండల నాయకులు సుడిపల్లి కొండలరావు, గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ, గిరిజన సంఘం.గిరిజన సమాఖ్య మరియు ప్రజా సంఘాలు. ఈ కార్యక్రమానికి ముందుగా గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు మాట్లాడుతూ...

విశాఖ ఏజెన్సీ ప్రాంతమైన హుకుంపేట మండలం లో ఒక ఆదివాసీ మహిళల కొర్లబు సూర్య మణి, గోపాల్, ఒక ఆదివాసి మహిళ అని కూడా చూడకుండా దుర్భాషలాడుతూ 4 గంటల సేపు పోలీస్ స్టేషన్లో నిర్బంధించి షాప్ ను కూల్చివేసిన తాసిల్దార్ కోటేశ్వరరావు వీఆర్వో మీసాల సింహాచలం పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, తాసిల్దార్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, వారం రోజుల నుండి మండల కేంద్రంలో ఉద్యమాలు జరుగుతున్నా కూడా అధికారులు, ప్రభుత్వం నేటి వరకు పట్టించుకోక పోవడంతో సోమవారం మండల కేంద్రంలో దీక్షలు ప్రారంభించడం జరిగింది.

## దేశంలో జరుగుతున్నటువంటి అప్రజాస్వామిక విధానాలపై రేపటి నుంచి కాంగ్రెస్ పార్టీ నిరసనలు



భీమునిపట్నం : అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ నాయకత్వంలో రాహుల్ గాంధీ ఆలోచనలతో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్ పిలుపు మేరకు దేశంలో జరుగుతున్న టువంటి అప్రజాస్వామిక విధానాలపై నిరసనలు. తెడ్డు రామదాసు అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు భోగి రమణ మాట్లాడుతూ ఈ నెల 7 వతేది నుండి 17వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల భాగస్వామ్యం తో పలు నిరసనలు తెలియజేస్తుందనీ.మొదటిగా కోవిడ్ బారినపడి న వారిని పరామర్శించి వారికి ఆత్మ స్థయిర్యాన్నిచ్చి మెడికల్ గా సహకారం అందించటం, పెంచిన పెట్రోల్ డీజిల్ దరలు మరియు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సైకిల్ ,రిక్షాలు లాగి ప్రజల భాగస్వామ్యంతో ఇంటింటికి ప్రచారం చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ఆదేశించిందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో నాల్గవ వార్డ్ చొక్కా నరసింగరావు, నాయకులు నిమ్మాయల పైడి రాజు ,పాసి వెంకటరావు, వి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరచుకోవాలి

### - వారం రోజుల నైపుణ్య శిక్షణ తరగతులు ప్రారంభం

### వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.సమత




ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సిన అసవరం ఉందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. సోమవారం ఉదయం ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో బోధనేతర సిబ్బందికి నిర్వహిస్తున్న వారం రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావ నైపుణ్యాలు ఎంతో ప్రధాన భూమిక పోషిస్తాయని, దీనిని వృద్ధి చేసుకోవాలన్నారు. డ్రాఫ్టింగ్ స్కిల్స్, అకౌంట్స్, సమయపాలన వ్యక్తి ప్రతిభను, ప్రగతిని ప్రభావితం చేస్తాయన్నారు. వత్తిడికి లోనవకుండా పూర్తిసామర్ధ్యాలను చూపుతూ పనిచేయాలన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమం పనితీరును మెరుగు పరచడానికి ఉపకరిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్సిటీ పాలక మండలి సభ్యురాలు ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ వర్క్ కల్చర్ ఎంతో ప్రధానమన్నారు.

విశ్వవిద్యాలయానికి మూలస్థంభాలైన విద్యార్థుల అవసరాలను గుర్తిస్తూ, వారికి సమర్ధ సేవలు అందించడం సిబ్బంది లక్ష్యమన్నారు.

కేంద్రం సంచాలకులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్ వారంరోజుల శిక్షణలో తర్ఫీదును అందించే అంశాలు, విధానాలను వివరించారు.

కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, హెచ్ఆర్డిసి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. ఆ సందర్భంగా కేంద్రం ఆవరణలో పలు పండ్ల మెక్కలను రెక్టార్ ఆచార్య కె.సమత నాటారు. ఈ సందర్భంగా ఆచార్య సమతను విభాగం తరపున సత్కరించారు.

## బండారును కలిసిన తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎన్



సబ్బవరం : నూతనంగా ఎన్నికయన అనకాపల్లి పార్లమెంట్ టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎన్ రాజు మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తిని, రాష్ట్ర పార్టీ కార్యదర్శి అప్పలనైదును సోమవారం వెన్నల పాలెంలో వారి స్వగృహంలో మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ.. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటించి పార్టీ బలో ఎతానికి కృషి చేయాలని సూచించారు. యువతని ప్రోత్సహించి పార్టీకోసం పనిచేసేలా అవగాహన కల్పించాలని బండారు సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ విజయానికి నా వంతు కృషి చేస్తానని బండారు తనపై ఉంచిన నమ్మ కాన్ని వమ్ము చేయనని ఆయనికి హామీ ఇచ్చాను.

## డిఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి



మాకవరపాలెం : తమకు న్యాయం చేయాలని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు విజ్ఞప్తి చేశారు. మాకవరపాలెం విచ్చేసిన ఎమ్మెల్సీని డిఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు.

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్‌రెడ్డి క్వాలిఫైడ్ డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## గీతం సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఉద్యోగాలు

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బిఎస్సీ, ఎమ్మెస్సీ వంటి సైన్స్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు సహితం ఇంజనీరింగ్ విద్యార్థులతో పోటీగా ప్రాంగణ నిమామకాలలో ఉద్యోగాలు సాధిస్తన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సోమవారం తేది 05-07-2021న జరిగిన ఆన్‌లైన్ ప్రాంగణ నియామకాలలో మారుతీ ఆర్గానిక్స్ సంస్థ 45 మంది సైన్స్ విద్యార్థులను రూ. 5.5 లక్షల రూపాయల వార్షిక వేతనంతో ఎంపిక చేసుకుందని ఇనిస్టిట్యూట్ ప్రాంగణ నియామకాల శిక్షణ విభాగం డిప్యూటీ డైరక్టర్ వెంకటేష్ తెలిపారు. బిఎస్సీ, ఎమ్మెస్సీ, ఎంసిఎ కోర్సులు అభ్యసిస్తున్న 150 మంది విద్యార్థులను ప్రముఖ కంపెనీలు జి.వి.కె.బయో, ఇండియాన్ ఇమ్యూనోలాజికల్స్, క్యూ-పాత్ ల్యాబ్స్, బయోలాజికల్-ఇ ప్రైవేట్ లిమిటెడ్, టాటాకన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో, డెల్టాయిట్, ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నా యని ఆయన తెలిపారు. యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కొత్తగా అనుమతులు మంజూరు చేసిందని వెల్లడించారు.

కాగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్.శరత్‌చంద్రబాబు అభినం దించారు.

## వైసీపీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి



భీమునిపట్నం : భారతదేశ స్వాతంత్ర సమర యోధులు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామ రాజు 125 వ జయంతి మరియు ఆధ్యాత్మిక వేత్త స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా భీమిలి జీవీఎంసీ 3 వ వార్డు వైఎస్ఆర్ సీపీ నాయకులు మైలపల్లి షణ్ముఖరావు ఆధ్వ ర్యంలో భీమిలి 3వ వార్డు పరిధి లో ఉన్నటు వంటి ఎండిఓ ఆఫీస్ లో గల అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి, వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుపర్పించారు.

ఈ కార్య క్రమంలో భీమిలి జీవీఎంసీ 3వ వార్డు వైఎస్ఆర్ సీపీ నాయకులు పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లిపిల్లి నర్సింగరావు ,బీసీ సెల్ అధ్యక్షులు వాసుపల్లి కొండబాబు ,పి.ఎం. ఎం.ఎస్ .వై జిల్లా సభ్యులు కదిరి ఎల్లాజీ, వాసుపల్లి ఎల్లాజీ రావు.( రంగ),పిన్నింటి యర్రయ్య రెడ్డి,వాసుపల్లి జానకిరామ్, గుండాసు మధు నాయుడు, చెల్లూరి గౌరీ నాయుడు, గొరపల్లి సన్యాసిరావు, రాంభుక్త ప్రభాకర్ నాయుడు, ఏ.సూర్య ప్రకాష్, కాసరపు ఎల్లాజి, ప్రగడ చంటి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించకుంటే ఆందోళన తప్పదు

### - ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం



దేవరాపల్లి : జిల్లాలోని ఉపాధి హామీ భకాయిలు వెంటనే చెల్లించకుంటే అందోళన తప్పదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న స్పష్టంచేసారు. సోమవారం అయిన దేవరాపల్లి మండలంని పర్యాటించి ఉపాధి కూలీలు తో సమావేశం నిర్వహించిన అనంతరం వెంకన్న మాట్లాడారు.

జిల్లాలోని ఎనిమిది వారాలు పైబడి 150 కోట్ల రూపాయలు పైబడి ఉపాది హమి కూలిలకు బకాయిలు చెల్లించవలసి ఉండగా సంభందించిన ఉన్నత అధికారులు కూలిలను తప్పుదోవ పట్టిస్తు జూన్ 15 వరక భకాయిలు చేల్లించామని చెబుతున్నారని ఇది పచ్చి మోసమన్నారు. ప్రభుత్వ ఉపాధి హామీ కూలిలు డబ్బులు ను ఇతరసంక్షేమ పథాకాలుకు ఉపయాగించు కుంటూ కూలీలు పొట్టకోడుతున్నారని ఈవిషయం అదికారులు దాసిపెట్టి కులాలు వారిగా డబ్బులు పడుతున్నాయని బకాయిలు లెవని బుకాయిస్తూన్నారని నిజానికి కూలీలు ఎకౌంట్సులో డబ్బులు పడటం లెదన్నారు. వెంటనే బకాయిలు చేల్లించక పోతే కోర్టు కు వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. పని చేసిన ప్రతికూలికి 15 రోజుల్లో బిల్లులు చెల్లింపులు చేయకండా ఉంటే సంభందించిన అదికారులు పై కేసులు పెట్టుకునే ఆధికారం కూలిలకు ఉందని అటువంటి ప్పుడు కూలీలు అధికారులు పై ఎందుకు కేసులు పెట్టకూడదని ప్రశ్నించారు. కరోనా వైరస్ వలన పట్టణ ప్రాంతాలుకు వలసలు వెళ్ళలేక గ్రామాల్లో పనులు లేక కూలీలు నానా అవస్థలు పడుతూ మండుటెండలో పని చేస్తూ ఉపాది హమిపనులుపై ఆధారపడి పని చేస్తూన్నారని అటువంటి కూలిలకూ కోట్లాది రూపాయలు భాకయిలు చెల్లించకుండ కూలిలను ఇబ్బందులు పెట్టడం సరియైనదికాదని పెండింగ్ భాకయిలు వెంటనే చేల్లించాలని డిమాండ్ చేశారు. మండలాలు వారిగా భకాయిలు, అనకాపల్లి 4,26,89,892 - ఆనందపురం 4,3010393 - ఆనంతగిరి 46339448 - అరుకు 5,9466831 - అచ్చుతాపురం 1160 8994 - భీమిలి 16493090 - బుచ్చయ్య పేట 51382323 - చీడికాడ 36251458 - చింతపల్లి 566 43212 - చోడవరం 28607664 - దేవరాపల్లి 34280 980 - డుంబ్రిగుడ 46480 996 - జిమాడుగుల 30134047 - గోలుగొండ 5046668 - గూడెంకొత్తవీది 34619207, - హుక్కుం పేట 57079959, - కె కోటపాడు 35493970,- కశింకోట 34102810, -కోటవురట్ల 50217398, -కోయ్యూరు 59406822, - వి మాడుగుల 45170245,- మాకవరపాలెం 60718582, - మునగపాక 24500347, - ముంచిగ్గుపుట్టు 3593 4463, - నక్కపల్లి 50348225, - నర్సీపట్నం 35662751, - నాతవరం 652 97 484, - పాడెరు 36011700, - పద్మ నాభం 32199753, - పరవాడ 11223531, - పాయక రావుపేట 15934598, - పెదబైలు 28837318, పెందుర్తి,రాంబిల్లి, రావికమతం 44603598, - రోలుగుంట 6072721187, యస్ ,రాయవరం 44213234, - సబ్బవరం 32194567, - యలమంచిలి 20076052, మొత్తంజిల్లా వ్యాప్తంగా 150,55,47,464 భకాయిలు ఉన్నాయి,వీటిని వెంటనే విడుదల చేసి కూలిలను ఆదుకోవాలని కోరారు. అవసరం అయితే కోర్టుకు వెళ్తామని తెలిపారు. వెంటనే పెండింగ్ లో ఉన్న ఉపాధి హమి బకాయిలు చేల్లించి జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలికి పనులు కల్పించాలని రోజు కూలి ఎంతవస్తుందో కూలిలకూ తెలియ జెస్తూ ఫెసిప్పులు టెంట్ మేడికల్ కిట్టులు సరపరాచేయాలని డిమాండ్ చేశారు.

## జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు పౌష్టికాహారం

### సర్పంచ్ కూండ్రపు వి.కె.వెంకునాయుడు



అచ్యుతాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్ కు బంగారుబాట వేస్తూ జగనన్న గౌరుముద్దతో పౌష్టికాహారం అందిస్తున్నారని సర్పంచ్ కూండ్రపు విమలకుమారి వెంకునాయుడు అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన చేతులు మీదుగా జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో బాగంగా కందిపప్పును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి లక్ష్మణరావు , పంచదార్ల రవి, కట్టమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## చెట్ల నీడన పుడమి చల్లన

పర్యావరణ సమతుల్యాన్ని కాపాడేవి హరిత వనాలే. హరిత వనాలతో స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. కాలానుగుణంగా వర్షాలు పడతాయి. నేల క్రమక్షయం తగ్గుతుంది. ఇంధన వనరులు, కలప లభ్యమవుతుంటాయి. ఈ వాస్తవాన్ని గుర్తెరిగిన తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకుని మొక్కలు నాటి పచ్చదనం పెంపొందిస్తూ దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తీర్ణం పెంపుదల కోసం తెలంగాణలో ప్రభుత్వం 2015 నుంచి హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యంతో సాగుతున్న కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నది. గత ఆరున్నరేండ్లలో పట్టణాల్లో, పల్లెల్లో, అడవుల్లో సుమారు 200 కోట్లకు పైగా మొక్కలను నాటడంతో రాష్ట్రంలో ఎటు చూసినా పచ్చదనం కనిపిస్తున్నది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2015-19 మధ్యకాలంలో లక్షా 85 వేల ఎకరాల్లో పచ్చదనం పెరిగింది. 18 శాతం ఉన్న అటవీ విస్తీర్ణం 24 శాతానికి చేరుకున్నది. హరితహారంలో భాగంగా హైదరాబాదులో 2020 వరకు 2.4 కోట్ల మొక్కలను నాటినట్లు అర్బన్ డే ఫౌండేషన్ పేర్కొన్నది. హైదరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పేరుతో తక్కువ విస్తీర్ణంలో మియవాకి పద్ధతుల్లో చిట్టడవులను పెంచుతున్నారు.

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం హైదరాబాదుకు అరుదైన గుర్తింపు తీసుకువచ్చింది. ఐరాసకు సంబంధించిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్‌కు అనుబంధంగా పనిచేసే అర్బన్ డే ఫౌండేషన్ సంస్థ- 2020 సంవత్సరానికిగాను హైదరాబాద్‌ను 'ట్రీ సిటీ ఆఫ్ ద వరల్డ్' (ప్రపంచ చెట్ల నగరం)గా గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. దక్షిణాసియాలోనే ఈ ఘనత సాధించిన మొదటి నగరంగా హైదరాబాద్ నిలిచింది. ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన కానుకగా రాష్ట్ర ప్రజలు కోటి వృక్షార్చన చేసిన మరుసటి రోజే ఈ ఘనత లభించింది. రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందింది. అనేకమంది ప్రముఖులు మొక్కలు నాటి మిగతావారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

హరితహారం కార్యక్రమంతో రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతం చూసినా పచ్చదనమే కనువిందు చేస్తున్నది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో హరితహారాన్ని భాగం చేస్తూ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేలా చూస్తున్నారు. వాటిలో కనీసం 85 శాతం మొక్కలు తప్పనిసరిగా బతికేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. పల్లె పట్టణ ప్రకృతి వనాలతో ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరుతూ స్వచ్ఛమైన వాయువులను పొందుతున్నారు. మొక్కలను ఎంతగా ప్రేమిస్తే అంతగా ఆయురారోగ్యాలు లభిస్తాయి. గ్లోబల్ వార్మింగ్ నుంచి మనలను మనం కాపాడుకోవాలన్నా, స్వచ్ఛమైన ప్రాణవాయువు తీసుకోవాలన్నా, సహజ వాతావరణంలో జీవించాలన్నా, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలన్నా పెద్ద ఎత్తున మొక్కలు నాటవలసిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అనుసరిస్తే మన దేశం హరిత దేశంగా విలసిల్లుతుంది. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో తమవంతు బాధ్యత నెరవేర్చాలి.

### ప్రజలకు వివిధ రంగాల్లో సేవలందించిన వారిని

## న్యూ హోప్ ఫౌండేషన్ గుర్తించి సత్కరించడం ఎంతో గొప్ప విషయం



విశాఖపట్నం : కరోనా మహమ్మారి విజృంభణకు భయపడకుండా ప్రజలకు వివిధ రంగాల్లో సేవలందించిన వారిని న్యూ హోప్ ఫౌండేషన్ గుర్తించి సత్కరించడం ఎంతో గొప్ప విషయమని శాసనమండలి సభ్యుడు పీ.వీ.ఎన్ మాధవ్ అన్నారు. సోమవారం అయన నివాసంలో న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ మంచా నాగ మల్లీశ్వరి ఆధ్వర్యంలో కరోనా వారియర్స్ అవార్డు పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఎంతోమంది సేవలందించారన్నారు. అటువంటివారిని సత్కరించడానికి మల్లేశ్వరి ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర మోహన్ మాట్లాడుతూ మల్లేశ్వరి చేస్తున్న కరోనా వారియర్స్ అవార్డు ల కార్యక్రమంలో తాను కూడా భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ మంచా నాగ మల్లీశ్వరి మాట్లాడుతూ కరోనా వారియర్స్ ను గత సంవత్సరం కూడా అవార్డులతో సత్కరించామని ఈ ఏడాది కూడా కరోనా సెకండ్ వేవ్ లో సమర్ధంగా సేవలనందించిన మరికొంత మంది వారియర్స్ ను అవార్డులకు ఎంపిక చేసి ఘనంగా సత్కరిస్తామని తెలిపారు.త్వరలోనే అవార్డు కార్యక్రమాల వివరాలను ప్రకటిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 22 వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, ప్రవీణ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విశాఖ కేర్ ఆసుపత్రిలో

## ఇంటర్నేషనల్ పల్మోనాలజి విభాగం ప్రారంభం

### ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విశాల్ గోయల్



విశాఖపట్నం : విశాఖ కేర్ ఆసుపత్రిలో ఇంటర్నేషనల్ పల్మోనాలజి విభాగాన్ని ప్రారంభించినట్లు ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విశాల్ గోయల్ తెలిపారు. సోమవారం కేర్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని కార్పొరేట్ ఆసుపత్రులలో మొట్ట మొదటి ఇంటర్నేషనల్ పల్మోనాలజి విభాగం తమ ఆసుపత్రిలో ఏర్పాటుచేసినట్లు తెలిపారు.ఇంటర్నేషనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ పల్మోనాలజీ ఊపిరితిత్తుల యొక్క మినిమల్లి ఇన్వసిస్ ఎండోస్కోపీ విధానాలను కలిగి ఉంటుందన్నారు.ఊపిరితిత్తుల యొక్క వివిధ రకాల క్యాన్సర్,క్యాన్సర్ ప్రారంభ రోగ నిర్ధారణ మరియు చికిత్స కోసం రోగనిర్ధారణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఇంటర్నేషనల్ పల్మోనాలజీ విధానాలు శస్త్రచికిత్సలు ప్రత్యామ్యయాలన్నారు. ఇంటెర్నేషన పల్మోనాలజీ విధానం సమర్ధవంతమైనదిగా పేర్కొన్నారు. తక్కువ హానికరమైనదని,ఇది సాధారణంగా అవుట్ పేషెంట్ విధానాల్లో చేయబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో పల్మనాలజిస్ట్ డాక్టర్ అనంతలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నంద కిషోర్ లు పాల్గొని ఇంటర్నేషనల్ పల్మోనోలోజి విధానాలను వివరించారు.

## దళితుల భూములను రక్షించాలి

### దళిత బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ సూర్యం డిమాండ్




విశాఖపట్నం : దళితుల భూములను రక్షించాలని దళిత బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ సూర్యం డిమాండ్ చేశారు.సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ జిల్లా అచ్చుతాపురం ఆవసోమవారం గ్రామంలో దళితుల భూములను రక్షించాలని కోరుతూ ధర్నా చేసారు.ఈ సందర్భంగా చింతాడ సూర్యం మాట్లాడుతూ నకిలీ రిజిస్ట్రేషన్ ల తో భూదందా చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.దళిత మహిళలను అవమానకరంగా దూషించిన స్టీల్ ప్లాంట్ మేనేజర్ అల్లూరి వెంకట రామరాజు,అతని అనుచరులను, ఎంఎస్ శర్మ అనే మరో భూ అక్రమ దారులను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. అక్రమణ దారులకు సహకరించిన అచ్చుతాపురం ఎస్ఐ లక్ష్మణ్ సస్పెండ్ చేసి, నిందుతులందరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేసారు.సుమారు 80 ఏళ్లుగా దళితుల పేరుతో ఉన్న భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు కుట్రలు చేస్తున్న వారి నుండి దళితులను ప్రాణ రక్షణ కల్పించి,న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత బహుజన సేన రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కారెం వినయ్ ప్రకాష్,ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు చెంగల చిన్నారావు,అంబేద్కర్ భవన్ గౌరవ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, దళిత బహుజన సేన మహిళా నాయకురాలు గండి రాజేశ్వరి,బాధిత కుటుంబ సభ్యులు పలివెలపెంటావు,జోగేష్,తదితరులు పాల్గొని దళిత హక్కులను కాపాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## కవి సమయం

### కోరికలు

ఆలోచనల నుండి కోరికలు ఉద్భవం
ప్రగతి సాధన పతనం అనుభవం
ఆలోచనల వలనే సాధ్యం
కోరికల వలన కర్మాచరణ
వివిధ పరిణామాల సంభవం
కోరికలకు అంతం ఎక్కడ?
సముద్రంలో అలల వలే
కోరికల నిరంతర ప్రవాహం
మానసిక చింతన, ఆందోళన
అలుపెరుగని జీవిత పోరాటం
కోరికలను జయించుట కంటే
నియంత్రణే ఉత్తమం
నిత్యజీవిత పోషణార్థం
అవసరమైన వాటికోసం ప్రయత్నం
మనస్సు పగ్గాలతో కోరికల
గుర్రాలకు కళ్లెం వేస్తూ
సంతృప్తితో నిండైన జీవితం
అత్యుత్తమం, సదా ఆచరణీయం


...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : జ్యేష్ఠ; తిథి : ద్వాదశి రా.12.39; కృత్తిక మ.3.57; వర్జ్యము లేదు

మంగళవారం 06-07-2021

**మేషం** : సమయానికి నిద్ర, భోజనం ఉండదు. ఉద్యో గులకు పై అధికారుల ఒత్తిడి కలుగుతుంది. అవసరాలకు అనుకున్న సమయానికి ధనం చేతికి అందుతుంది. రాజకీయ నాయకులకు అనుకూలం. నూతన వ్యాపారములు చేయువారికి అనుకూలించును. ఆరోగ్యం బాగుంటుంది. పాత సన్నిహితులను కలుసుకుంటారు. **వృషభం** : దూర ప్రయాణములు చేస్తారు. దర్ఘీరోగులు మాత్రం జాగ్రత్త అవసరం. పెద్దల సహకారం కలుగును. శరీర ఒత్తిడి అలసట ఎక్కువగా ఉంటుంది. నిరుద్యోగులకు ఉపశమనం కలుగుతుంది. పెద్దల సహకారం కలుగును. **మిథునం** : దూరపు బంధువులతో ఇష్టాగోష్ఠి చేస్తారు. నూతన సినీ రంగంలో ప్రవేశించు వారికి గుర్తింపు కలుగుతుంది. విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొం టారు. ఆరోగ్యం బాగుండును. **కర్కాటకం** : వృత్తి వ్యాపారాలు చేయువారు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఆధ్యాత్మిక, దైవ, సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. మీ బాధ్యతలు ఇతరులకు అప్పగించవద్దు. ఎంత సంపాధించినా ధనం నిలబెట్ట లేకపోతారు. మీ ప్రత్యర్థుల విషయంలో అప్రమత్తంగా మెలగండి. సహోద్యోగులు మనసు తెలిసి వ్యవహరిస్తారు. **సింహం** : ఆర్థిక విషయాలలో ప్రోత్సాహకరంగా వుంటుంది. కష్టమైన పనులన్నింటిని దిగ్విజయంగా పూర్తిచేస్తారు. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబీకులు మీ అభిప్రాయా లతో ఏకీభవిస్తారు. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయలు, చిరు వ్యాపారులకు పురోభివృద్ధి. **కన్య** : బంధుమిత్రులను కలుసుకుంటారు. కొత్త పరిచయాలు ఏర్పడతాయి. మీ మనస్సుకు ఆనందం కల్గించే పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఆర్థికంగా లాభం. ప్రియతముల వైఖరిలో మార్పు, ఆనందం కలుగుతుంది. **తుల** : బంధువుల ఆకస్మిక రాక మీకు ఎంతో ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఏదన్న అమ్మకానికి చేయు ప్రయత్నాలలో సఫలీకృతులు కాగలరు. నిరుద్యోగులకు సదవకాశాలు లభిం చినప్పటికిని వాటిని సద్వినియోగం చేసుకొలేకపోతారు. ఓర్పు పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. పొదుపు ఆవశ్యకతను గుర్తిస్తారు. **వృశ్చికం** : రిటైల్, రియల్ ఎస్టేట్ రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. మీరు మార్పు కోసం ఆరాటపడతారు. కొత్త ఆలోచనలు మీ మదిలో మెదులుతుంటాయి. **ధనుస్సు** : బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తుల పట్ల అవసరం. పెద్దల ఆరోగ్యము గురించి ఆందోళన చెందుతారు. గృహము నకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. ప్రైవేటు సంస్థలలోని వారికి పనిభారం అధికమవుతుంది. **మకరం** : వృత్తి వ్యాపారాలకు సంబంధించి ముఖ్య మైన నిర్ణయాలు తీసు కుంటారు. ప్రముఖ వ్యక్తులను కలుసుకుంటారు. మీ ప్రతి భకు గుర్తింపు లభిస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల ధోరణి ఆందోళన కలిగి స్తుంది. మిత్రులను కలుసుకుంటారు. సోదరీ, సోదరులతో ఏకీభవించలేరు. ఉద్యో గస్తులు అధికారులతో సంభాషించునప్పుడు మెళుకువ అవసరం. **కుంభం** : బ్యాంకుల ఆర్థిక సంస్థలతో వాయిదా పడతాయి. స్త్రీలు టి.వి.ఛానెళ్ళ కార్యక్రమాల్లో రాణిస్తారు. విద్యార్థుల్లో మనోధైర్యం, ఏకాగ్రత నెలకొంటాయి. దూర ప్రయాణాలు, పుణ్యక్షేత్రాల సందర్శ నలకు పథకాలు రూపొందిస్తారు. మీ అలవాట్లు, బలహీనతలు గోప్యంగా ఉంచటం క్షేమదాయకం. ఖర్చులు పెరిగే ఆస్కారం ఉంది. **మీనం** : వృత్తి పరమైన సమా వేశాలకు అనుకూలం. లక్ష్యసాధనకు మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. న్యాయ, బోధన కళారంగాలవారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. దీక్షా, పట్టుదలతో అనుకున్న లక్ష్యం సాధిస్తారు. వ్యాపారాల్లో భాగస్వామి సహాయ సహకారం లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. రుణయత్నాల్లో స్వల్ప ఆటంకాలు



## రామాయణం: సీతాదేవి వ్యక్తిత్వం.. ప్రత్యేకత

### సంకీర్తన

క్షమ..దయ...ధైర్యం...వివేకం...ఆత్మాభిమానం కలబోసిన ఉదాత్తమైన స్త్రీ పాత్ర సీత'. సతీ లేనిదే రామాయణం లేదు. సీత లేకుండా రాముని జీవితాన్ని అసలు ఊహించలేము. కాబట్టే రామాయణ ఇతిహాసంలో ఆమె పాత్రపై ఎందరో మహానుభావాలు మరియు మేథావులు పరిశోధనలు కూడా చేశారు. సీతలోని సుగుణాలు నేటి మగువలకు ఎంతో ఆదర్శం. ఆమె చరితం ఓ స్ఫూర్తిదాయకమైన కథాసాగరం. రామాయణంలో ఏ ఘట్టం తీసుకున్నా సీత గుణగుణాలు ప్రతి ఒక్కరికీ ఎంతో ఆదర్శప్రాయంగా నిలుస్తాయి... ధర్మమూర్తి: సీత ఒక ఇల్లాలిగా తన భర్త బాధ్యతలో, కర్తవ్య దీక్షలో తను కూడా పాలుపంచుకొని ఆదర్శ గృహిణిగా మారిన మహాసాధ్వి సీతాదేవి'. రాముడు తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి అరణ్యవాసానికి వెళ్లినప్పుడు తన భర్త అడుగుజాడల్లో తనూ నడిచి, అతని కష్టసుఖాల్లో పాలు పంచుకోవడానికి సిద్ధమైన ధర్మపత్నిగా తన ధర్మాన్ని నిర్వర్తించింది. దయాశీలి: పేదవారిని ఆదరించి అన్నం పెట్టాలన్న దయాగుణం గల స్త్రీమూర్తి సీత. అదే భావనతో తనింటికి మారువేషంలో బిక్షాటన వచ్చిన రావణుడికి లక్ష్మణరేఖ దాటి మరీ భిక్షం వేసిన దయామూర్తి ఆమె. తన రక్షణ కోసం పెట్టుకున్న నియమం కన్నా దానమే గొప్పదన్న నీతిని ఆమె ఈ సందర్భంలో వెల్లడిస్తున్నది. ధైర్యశాలి: పాతివ్రత్య నిరూపణ కోసం సీతను అగ్నిప్రవేశం చేయమని రాముడు అడిగినప్పుడు ధీరత్వంతో ఆ పనికి సిద్ధమైన ధైర్యశాలి సీత. రాముని మాటలు ఆమె గుండెను గాయపరిచినా సహనంతో భరించింది. తానే తప్పు చేయలేదన్న ఆమె ఆత్మవిశ్వాసం చివరికి నిందారోపణ చేసిన వారిని సైతం తలదించుకునేలా చేసింది. అభిమానవతి: సీతకు ఆత్మాభిమానం ఎక్కువ. చిత్రకూటానికి సీతారాములు వచ్చారని తెలిసి, ఆమె తండ్రి జనకుడు వారిని కలిసి వనవాసం పూర్తయ్యేదాకా మిథిలానగరానికి వచ్చి తనతో పాటు ఉండమని కోరినప్పుడు, ఆ మాటలను సున్నితంగా తిరస్కరించిన ఆత్మాభిమాని సీత. మెట్టినింటికొచ్చాక ఎన్ని విషమ పరిస్థితులెదురైనప్పటికీ తమే పరిష్కరించుకోవాలి గానీ, పుట్టింటి వారిని ఇబ్బంది పెట్టకూడన్న అభిమానవతి సీత. జంతు ప్రేమికురాలు: ప్రకృతి మీద, పశుపక్ష్యాదుల మీద ఎనలేని ప్రేమ కలిగిన స్త్రీమూర్తి సీత. అదే ప్రేమతో అందమైన జింకను తన కోసం తీసుకురమ్మని భర్తను అభ్యర్థిస్తుంది సీత. వివేకవంతురాలు: రావణాసురుడు తనను అపహరించి తీసుకెళ్లిపోతున్నప్పుడు, రాముడికి తన ఆనవాళ్లు చిక్కడం కోసం బంగారునగలను నేల మీద జారవిడిచిన వివేకవంతురాలు సీత. ప్రేమమూర్తి: సీతకు రామునిపై ఎంతటి ప్రేమానురాగాలంటే..ఆ ప్రేమలో తనను తానే మైమరిచిపోయేది. రావణుడి చెరలో బందీగా ఉండి కూడా నిత్యం శ్రీరామనామస్మరణ చేస్తూ అనుక్షణం పతి క్షేమాన్ని కోరేది. చైతన్యశీలి: సీత ఎంత చైతన్యశీలి అంటే అపాయంలో కూడా భయంతో ఆమె శత్రువులకు లొంగలేదు. రావణడు సీతను బెదిరించి, తన వశం కావాలని ఆదేశించినప్పుడు, ఒక గడ్డిపరకను అడ్డంగా పెట్టుకొని నువ్వు నాకు దీనితో సమానం అని చెప్పకనే చెప్పి అతని ధర్మహీనతను ప్రశ్నించిన ప్రజావంతురాలామె. క్షమాగుణం: రాక్షస సంహారం తర్వాత సీతను అశోకవనం నుంచి విడిపించి తీసుకువెళ్తున్న సమయంలో, తను బందీగా ఉన్నప్పుడు ఆ వనంలో తనను మాటలతో హింసించిన రాక్షసులకు ఏ కీడు తలపెట్టవద్దని, వారు స్వామిభక్తితో తమ బాధ్యతను మాత్రమే నిర్వర్తించారని హనుమంతునితో చెప్పిన క్షమాగుణం సీత సొంతం. ఆదర్శమూర్తి: అడవిలో ఆశ్రమవాసిగా కాలం గడుపుతూ కూడా తన కుమారులను ప్రయోజకుల్ని చేయాలని ఎల్లవేళలా తపిస్తూ, వారిని కార్యసాధకులుగా తీర్చిదిద్దడం ఆమె ఉత్తమ పెంపకానికి నిదర్శనం.

# భార్యపై భర్త హత్యాయత్నం



అరకులోయ : జీవితాంతం ఉండవలసిన టువంటి భార్యపై ఉదంతమిది. బాధిత గిరిజన వివాహిత బంధువులు కథనం ప్రకారం ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గన్నెల పంచాయతీ గుడ్డి గ్రామానికి చెందిన కుర్ర లవకుశ గిరిజనుడు అనుమానం తో తన భార్య కుర్ర ఎక్కువ జామున కట్టి నోటికి గుడ్డలు కుక్కి పెట్రోలు పోసి నిప్పంటించాడు. దీంతో ఉన్న వివాహిత రక్షించుకునే ప్రయత్నంలో బయటకు పరుగులు తీసింది. దీంతో భర్త లవకుశ అడ్డు కొనే ప్రయత్నం చేస్తుండగా బాధిత బంధువులు గమనించి ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు. హుటాహుటిన స్థితిలో అంబులెన్సు సహాయంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రి కి తరలించే ప్రయత్నం చేశారు. పరిస్థితి విషమించడంతో మార్గమధ్యలో బాధితు రాలు మరణించినట్టు బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై మృతురాలి బంధువులు పోలీసు లకు ఫిర్యాదు చేశారు.

దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఊరు బాగోగులు చూసే పెద్దమనిషి కావడం విశేషం.

# హెరిటేజ్ పాడిరైతులకు ఏరువాక బోనస్

## మేనేజర్ కూండ్రపు శేషు



అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేసే పాడిరైతులకు రూ. 2.8 కోట్లు ఏరువాక బోనస్ విడుదలైనట్లు డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు . అదివారం వెదురువాడ గ్రామంలో హెరిటేజ్ పాడిరైతులు 55 మందికి ఏరువాక బోనస్ 2 లక్షల 20 వేలు రూపాయలు ఆయన చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ పాడిరైతులకు అధిక పాల ధర చెల్లిస్తూ, ఏడాదికి రెండు సార్లు బోనస్ పంపిణి చేస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో బి సాయి రాజు, కె.శ్రీనివాసురాజు, బి.అప్పలరాజు, ఎం అప్పా రావు, కె.రవి, ఆర్.అప్పారావు తదితర రైతులు ఉన్నారు.

## పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, మాస్కులు, ఆరోగ్య శక్తి పానీయాలు

# పంపిణీ చేసిన వివేకానంద సంస్థ..



విశాఖపట్నం : జివియంసి 9వ వార్డు, జోడుగుళ్లపాలెం లోని.. 20 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు వన్‌టౌన్‌లో వున్న శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ.. దుప్పట్లు, మాస్కులు, ఆరోగ్య పానీయాలు పంపిణీ చేసింది. కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్నం స్వాతి చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు వీటిని అందజేసింది. అనంతరం సంస్థ గౌరవ సభ్యులు బండారు గజపతి స్వామి తదితరులు కార్పొరేటర్ ను ఘనంగా సన్మానించారు.

కరోనా సమయములో పారిశుధ్య కార్మికులు చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉమ్మడి అప్పారావు, ఉమ్మడి దాసు, దూడ అప్పన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# దిశా యాప్ పై అవగాహన పెంచుకోవాలి

## డిప్యూటి మేయర్ కటుమూరి సతీష్



కంచరపాలెం : మహిళల ఆత్మరక్షణకు కవచంగా దిశా యాప్ పనిచేస్తుందని.. యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్ లోడ్ చేసుకొని వినియోగించాల్సిన సమయం ఆసన్నమైందని జీవిఎంసి డిప్యూటి మేయర్ కటుమూరి సతీష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఉత్తరనియోజకవర్గం 46 వార్డులో పరిధిలో క్షేత్రస్థాయిలో "దిశా" యాప్ వినియోగానికి దిశా చట్టం, యాప్ పై అవగాహన సదస్సు సోమవారం నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హజరైన జీవిఎంసి డిప్యూటి మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ మహిళా రక్షణ గురించి ముక్యమంత్రి వైఎస్ .జగన్ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అద్భుతమైన ఆలోచన, ఆశయంతో దిశా చట్టానికి రూపకల్పన చేశారన్నారు. దేశంలోనే మొట్టమొదటి గా మహిళా రక్షణ కోసం చట్టం చేశారన్నారు. దిశా యాప్ ను ప్రతి ఒక్క మహిళ ఫోన్ లో డౌన్ లోడ్ చేయించాలన్నారు. కేంద్రం అమలు చేసిన నిర్భయ, ఫోక్సో చట్టాల కన్నా బలమైన చట్టంగా దిశా అవతరించిందన్నారు. జగనన్న నిర్ణయాన్ని అన్ని రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఏ ఒక్క మహిళా అఘాయిత్యాలకు గురికాకూడదని సీఎం సంకల్పిం చారన్నారు. మహిళల ప్రాణాలకు భంగం కలగకుండ వుండలని మహిళల రక్షణ కోసం రూపొందిన దిశా యాప్ ను ఆపదలో ఉన్న మహిళలు ఉపయోగించుకునేలా అవగాహన కలిగివుండాలని సూచించారు. అన్ని గ్రామ,కోలనిలో సంఘ మిత్రలు దిశా యాప్ డౌన్ లోడ్ చేయించి ఎక్కువ మందికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మహిళా స్రృహతో పాటు ఎంతో అప్రమత్తంగా మనల్ని మనం రక్షించుకోవాలని విశ్లేషించారు. స్త్రీకి కావాల్సిన భద్రత, గౌరవాన్ని కాపాడటానికి ఏర్పాటు చేసిన దిశా యాప్ ను కొనియాడారు. కార్యక్రమంలో కంచరపాలెం పోలిస్ ష్టేషన్ యస్ ఐ లోకెష్ ,క్రైమ్ యస్ ఐ స్థానిక గ్రామసచివాలయం పోలిస్ లు, కె,చిన్నా, జి.కృపారావు, మహిళా సంఘాలు, లీడర్లు స్థానికలు పాల్గొన్నారు.

# వాటర్ ప్యూరిట్ వితరణ



భీమునిపట్నం : భీమిలీ జోన్ జీవీఎంసీ 1వ పరిధిలో ఉన్న బొగ్గు రోడ్-2 సచివాలయంలో స్థానిక సంఘ సేవకులు ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ మణికంఠ స్వీట్స్ బేకరీ మరియు ఎం ఎఫ్ సి ఫుడ్ కోర్ట్ అధినేతలు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ ఆర్థిక సాయంతో వాటర్ ప్యూరిట్ ని వైఎస్సార్సీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిరి.విజయకుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమాన్ని కి భీమిలీ జోన్ జీవీఎంసీ వై సి పీ 1వ వార్డ్ కార్పొరేటర్ అక్కరమాని.పద్మావతి రామునాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి వాటర్ ప్యూరిట్ ని ప్రారంభించారు.ఈ యొక్క కార్యక్రమంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గపిల్ల.ప్రసాద్,మజా కౌన్సిలర్ లు,జీ.వి రమణ,జిల్లా కార్యదర్శి కుంచపు. శివరామకృష్ణ, వార్డ్ అధ్యక్షులు వెంపాడ.వెంకటరమణ రెడ్డి,చింతగుంట.శివ,జీరు. శ్రీనివాస్ రెడ్డి, తమ్మిన.నర్సింగ్ మరియు సచివాలయం అడ్మిన్, సెక్రటరీలు,వార్డ్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 7వ తేదీన సత్యదేవుని హుండీలు లెక్కింపు



అన్నవరం : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీలను సిబ్బందితో మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్స్ ను వినియోగించి భౌతిక దూరం పాటించుచూ ది.07-07-2021 తేదీన ఉదయం గం.7-30 ని.లకు తెరచుటకు సదరు సొమ్మును బ్యాంకు లో జమ చేయుటకు కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు మేరకు యావన్మందికి భక్తులకు, గ్రామస్థులకు తెలియజేయ డమైనది.

# అమూల్ భవన నిర్మాణానికి భూమి పూజ



అచ్యుతాపురం : మండలంలో మడుతూరు గ్రామంలో అమూల్ డెయిరీ భవనం నిర్మాణానికి సర్పంచ్ మోటూరు సంజీవ్ సోమవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట వెంకటేష్, విఆర్ఒ లక్ష్మి, జె.శివ తదితరులు ఉన్నారు.

# విత్తనశుద్ధి తప్పనిసరి

మాకవరపాలెం : వరి రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చిరంజీవి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూడోమోనాస్ మందుతో విత్తనశుద్ధి చేసుకోవాల న్నారు. ఇలా చేయడం వల్ల విత్తనాల ద్వారా వచ్చే తెగుళ్లు నివారిం చవచ్చునన్నారు. నారు కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు.ఈ సూచనలను రైతులంతా తప్పనిసరిగా పాటించాలని కోరారు.

# గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి



పాడేరు : హుకుంపేట మండలం పెంచిన పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగటం తో సామాన్యులజీవితం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 300 ఉండాల్సిన గ్యాస్ 1000 రూపాయలకు,30 రూపాయలు ఉండాల్సిన డీజిల్ 80 రూ పాయలు,35 రూపా యలు ఉండాల్సిన పెట్రోల్ 104 రూపాయల కు చేరడం, అదికూడా కరోన కష్టకాలంలో మోడీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం, వైసీపీ జగన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు లాభాలు వచ్చేలా నిర్ణయం చేయడం,ధరలుపెంచడం మరీ దారుణం. పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలు పెరగడంతో ప్రైవేటు అదాని, అంబానీ కంపెనీలకు కోట్లు ఆదాయం, లాభాలు ప్రజలకు కష్టాలు పాలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ టీయూ మండల నాయకులు కిల్లో రామారావు, పాంగి సోమన్న,కృష్ణా రావు,మజ్జి వెంకటరమణ, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



అచ్యుతాపురం : మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు కృషి చేస్తున్నారని ఎంపీపీ అభ్యర్థి కోనా బుజ్జి, జడ్పీటీసి అభ్యర్థి లాలం రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యలయంలో డ్వాక్రా మహిళలకు...

తక్కువ ధరకే పైనాపిల్ పండ్లను వారు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణ, పిన్నంరాజు వాసు,డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలకు పాల్పడితే ఊరుకోము

## - భీమిలీ జోన్ జివియంసి 1వ వార్డ్ కార్పొరేటర్ అక్కరమాని పద్మావతి రామునాయుడు



భీమునిపట్నం : నూతనంగా భీమిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి బాధ్యతలు చెప్పటిన కోరాడ.రాజబాబు మరియు కొందరు టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలకు కొదవ లేకుండా పోయిందని వైఎస్సార్సీపీ భీమిలీ జోన్ జీవీఎంసీ 1వ వార్డ్ కార్పొరేటర్ అక్కరమాని. పద్మావతి రాము నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి వై.యెస్ జగన్మోహన్ రెడ్డి మరియు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు కోసం సంక్షేమం, అభివృద్ధి ద్వేయంగా పని చేస్తున్నారని తెలిపారు.ముఖ్యంగా ఇటువంటి కరోనా కష్ట కాలంలో సంక్షేమ ఫలాలు అందించడమే కాకుండా,కరోనా 2%అఽ% వేవ్ విజృబించిన నేపథ్యంలో విశాఖపట్నం జిల్లాలో మంత్రి అవంతి.శ్రీనివాసరావు సారథ్యంలో ఎక్కడ బెడ్స్ కొరత కానీ,ఆక్సిజన్ కొరత కానీ,మందులు కొరత కానీ,లేకుండా సరయిన సమయంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలుకు అన్ని విధాలుగా అండగా నిలిచి కోవిడ్ సెంటర్ లు ఏర్పాటు చేయడమే కాకుండా,కరోనా బారిన పడిన ప్రతి ఒక్కరికి మంచి సదుపాయం కలిపించి అండగా నిలిచారని తెలిపారు.. దేశంలోనే వాక్సినేషన్ కొరత లేకుండా ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రరాష్ట్రం నెంబర్ "1"స్థానాల్లో నిలిచిందని తెలిపారు.ఇటువంటి గొప్ప కార్యక్రమాలు చేస్తుంటే ఈ రెండున్నర సంవత్సర వ్యవధిలో కేవలం తెలుగుదేశం పార్టీ అధినాయకుడు దగ్గర నుండి నాయకులు అందరూ కేవలం జూమ్ లో అసత్య ప్రచారాలు, తప్పుడు ఆరోపణలు,శవ రాజకీయాలు తప్ప ఎప్పుడుప్రజలు అండగా నిలిచిన దాఖలాలు లేవని తెలిపారు. మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నియోజకవర్గానికి తండ్రి స్థానంలో ఉంటూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ "నేను విన్నాను- నేను ఉన్నాను" అని భరోసా కలిపించారని భీమిలి నియోజకవర్గంలో ఉన్న దశాబ్ద కాలంగా ఉన్న సమస్యలను గతంలో ఎన్నడూ లేని విధంగా పరిష్కరించారని కొనియాడారు. ముఖ్యమంత్రి

అయిన మూడు నెలలు వ్యవధిలోనే గొప్ప సంస్కరణలు ముందుకు తెచ్చి జాతిపిత మహాత్మాగాంధీ కళలు కన్నటువంటి గ్రామ స్వరాజ్యాని ముందుకి తీసుకువచ్చి దాదాపు 1,50,000 మందికి గ్రామ సచివాలయం మరియు 2,50,000 మందికి అంటే అక్షరాల నాలుగు లక్షల మందికి ఉద్యోగ అవకాశం కలిపించిన భారతదేశ చరిత్రలోనే ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని తెలిపారు.

ఈరోజు కి జాబ్ క్యాలెండర్ పెట్టి అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి కేవలం రెండు సంవత్సరాలు కాలం వ్యవధిలోనే అక్షరాల 1,43,000 ఉద్యోగాలు భర్తీ చేసిన ఘన చరిత్ర ఒక్కముఖ్యమంత్రి వై.యెస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని జీవీఎంసీ 1వ వార్డ్ అక్కరమాని పద్మావతి రామునాయుడు తెలిపారు.ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ నాయకులు,జగనన్న ఈ రాష్ట్రంలో ఉన్న ప్రజలు కోసం చేస్తున్న పనులన్నీ హర్షించి,40ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో...

పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ జే.ప్రసాద్,మాజీ కౌన్సిలర్ జీ.వి రమణ, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిరి విజయకుమార్, సీనియర్ నాయకులు, వార్డ్ అధ్యక్షులు వెంపాడ వెంకటరమణ రెడ్డి,కుంచపు శివరామకృష్ణ, చింతగుంట.శివ, రాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనేతరులకు ఆర్ఓఎఫ్ఆర్ భూములిస్తే కఠిన చర్యలు తప్పవు

**- ఐటిడిఏ పిఓ గోపాలకృష్ణ రోణంకి**



పాడేరు : అడవి హక్కు పత్రాలను గిరిజనేతరులకు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి గోపాలకృష్ణ రోణంకి హెచ్చరించారు. ఐటిడిఎ కార్యాలయం లో నుండి పాడేరు. నర్సీపట్నం. అనకాపల్లి.రెవెన్యూ డివిజన్ల పరిధిలోని సబ్ ప్లాన్ మండలాల తాసిల్దారులు. ఎంపీడీవోలు.సబ్ ప్లాన్ మండలాలలో ఉన్న గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చడం కొండ కుమ్మర్ల గిరిజనులుగా గుర్తించడం ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాల పంపిణీ పై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద గిరిజనుల అభ్యున్నతికి అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూములు పొందిన గిరిజనులకు రైతు భరోసా అందించాలన్నారు. 5వ. షెడ్యూల్లో చేర్చడానికి ప్రతిపాదనలు సబ్ ప్లాన్ మండలాల్లో 50 శాతం పైగా గిరిజనుల నివశిస్తున్నా గిరిజన గ్రామాలను గుర్తించి సమగ్రమైన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. 2011 నాటికి ఉన్న జనాభా ప్రతిపాదిక ను పరిగణలోకి తీసుకొని నివేదికలో సిద్ధం చేసి ఈనెల 7వ తేదీన సమర్పిస్తే వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. ఏపీ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు గిరిజన సంఘాల నేతలతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించి వారి సూచనలు పరిగణలోకి తీసుకొని నివేదికలు రూపొందించాలన్నారు.కొండ కుమ్మర్ల జీవన విధానంపై నివేదికలు కొండ కుమ్మర్ల ఎస్టీ జాబితాలో చేర్చడానికి సమగ్రమైన నివేదికలు రూపొందించి సమర్పించాలని స్పష్టం చేశారు కొండ కుమ్మర్ల జీవన విధానంపై కట్టుబాట్లు. ఆచార వ్యవహారాలు వృత్తులు ఆహారపు అలవాట్లు పరిశీలించాలన్నారు. అదేవిధంగా 1950 నుంచి ఉన్న పాఠశాలలో రికార్డులను తనిఖీ చేసి పాఠశాల రికార్డుల్లో కులం ఎలా నమోదు చేశారు పరిశీలించి నమోదు చేయాలన్నారు జనన మరణ రికార్డులను ఆధారాలతో సహా సేకరించి నివేదికలు రూపొందించాలని స్పష్టం చేశారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలు అమలు చేస్తున్నది లేనిది తనిఖీ చేయాలన్నారు. కొండ కుమ్మర్ల జనాభా గృహ సముదాలను నివేదికలో చేర్చి ఈనెల 8వ తేదీలోగా ఐ టి డి ఎ కు సమర్పించాలన్నారు. ప్రతి పేద గిరిజన కుటుంబానికి రెండెకరాల భూమి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రాంతంలోని 11 మండలాలు సబ్ ప్లాన్ మండలంలోని ప్రతి పేద కుటుంబానికి కనీసం రెండు ఎకరాల భూమిని పంపిణీ చేయాలన్నారు.

గిరిజన భూముల్లో గిరిజనేతరులు సాగు చేయడానికి వీలు లేదన్నారు. కులం పేరు ఇంటి పేరు ఆధార్ లో మార్పులు చేసి అటవీ హక్కు పత్రాలు పొందితే కఠినంగా వ్యవహరిస్తా మన్నారు. మూడవ జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమోదం పొందిన లబ్ధిదారులకు స్థానిక శాసన సభ్యులతో సంప్రదించి పట్టాలు పంపిణీ చేయాలని ఆదేశించారు గ్రామాల్లో పర్యటించి అనర్హులు జాబితాను మరొక్కసారి పరిశీలించి నిర్ధారించుకోవాలి చెప్పారు ఈ సమావేశంలో పాడేరు నూతన సబ్ కలెక్టర్ వి. అభిషేక్. పాడేరు. నర్సీపట్నం. అనకాపల్లి. సబ్ ప్లాన్ మండలాల తాసిల్దార్లు. ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఆనందపురం మండలం అభివృద్ధి పనులపై మంత్రి అవంతి సమీక్ష



భీమునిపట్నం : గ్రామస్థాయిలో మళ్లీ రివ్యూ చేసి అర్హులైన లబ్దిదారులు అందరికీ జగనన్న ఇళ్ళు అందించాలని మంత్రి అవంతి శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురంలో జగనన్న ఇళ్లపై అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. లబ్దిదారుడికీ ఇల్లు అందివ్వాలనేది ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం అని అన్నారు. ఎటువంటి అవినీతి, పక్షపాతం లేకుండా అర్హులందరికీ జగనన్న ఇళ్ళు అందించాలని అన్నారు. పేదలకు ఇళ్ళు అందించే క్రమంలో అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం, అలసత్వం వహించొద్దని ఆదేశించారు. సీఎం జగన్ ఈ విషయంలో చాలా ఖచ్చితంగా ఉన్నారని అన్నారు. జగనన్న ఇళ్లపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు. సీఎం జగన్ కు మంచిపేరు వస్తుందనే చంద్రబాబు నాయుడు జూమ్ నుంచే కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇళ్ళు అందించే క్రమంలో ఎవరైనా అడ్డంకులు సృష్టించినా సహించనని మంత్రి అన్నారు. గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని అన్నారు. ప్రతి గ్రామంలో చెరువు పనులు చేపట్టి నరేగా నిధులతో ఉపాధి అవకాశాలు పెంచాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పనులపై సమీక్షించారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకే, వెల్నెస్ సెంటర్స్ త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో కోవిడ్ వాక్సినేషన్ జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుతుపడిందని.ఇకపై పనుల్లో వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. త్వరలో ప్రతి గ్రామంలో పర్యటిస్తానని మంత్రి అవంతి శ్రీనివాస్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధికారులు, గ్రామ సర్పంచులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా కోడి వ్యర్థ పదార్ధాలు వేయరాదు

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ పైడిమాంబ అలయం ఎదురుగా గల రోడ్డుకు ఇరువైపులా కొంతమంది వ్యాపారస్తులు కోడి వ్యర్ధపదర్ధాలును వేస్తున్నారు అని ఈవ్యర్ధ పదర్ధాములు వలన శునకాలు ఎక్కువుగా అప్రాంతాల్లో సంచరిస్తు పలు ప్రమాదాలుకు దారితీస్తున్నాయి అని స్దానికులు చెప్తున్నారు . సోమ వారము ఈ రోడ్డులో జరిగిన ప్రమాదంలో కొందరు గాయ పడ్డారుఅని పలువురు స్దానికులు తెలిపారు. ఇప్పటికైనా స్దానిక అదికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి అని కోరుతున్నారు.

## ఆంధ్రప్రభ విలేఖరి ప్రకాష్ కు ఘన నివాళి



పరవాడ : మండల కేంద్రమైన పరవాడ మరిడిమాంబ కమ్యూనిటి హల్ లో అదివారం పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అంధ్రప్రభ విలేఖరి పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ కార్యదర్శి క్రీ.శే.దుద్దుపూడీ సూర్యప్రకాష్ సంతాపసభ ఘనంగా జరిగింది. ముందుగా పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ అద్యక్షుడు లాలం కృష్ణారావు చేతులుమీదగా ప్రకాష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరము అయన మాట్లడుతూ పరవాడ న్యూప్రెస్ క్లబ్ వ్యవస్థాపన చేయుటములో ప్రకాష్ కీలకపాత్ర వహించారు అని తెలిపారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటామనీ భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిదిలు పి.జగదీశ్వరావు, రెడ్డిగోపి, పైల నాయుడు, పి.సత్యనారాయణ, మోహన్ రావు, రాజు, మహేశ్వరావు, నాగేశ్వరావు, శ్రీను,రాము, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి



భీమునిపట్నం : మన్నెం వీరుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతి సంద ర్భంగా 2వ వార్డు బీజేపీ ప్రధాన కార్యదర్శి శిరపు రామలక్ష్మి 1వ వార్డు ప్రెసిడెంట్ ఐనాడ మాధవ్ ఆధ్వర్యంలో తగరపువలస ఆదర్శనగర్ లో అల్లూరి సీతా రామరాజు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిం చారు. 1వ వార్డు ప్రెసిడెంట్ ఐనాడ మాధవ్ మాట్లాడుతూ సీతారామరాజు మన్యం లోని గిరిజనులను సమీకరించి, వారిని దుర అలవాట్లకు దూరం చేసి వారికి యుద్ధ విద్యలు నేర్పించి వారిలో ధైర్యాన్ని పెంపొందించి అన్యాయాలను ఎదిరించే విధంగా తయారు చేసారన్నారు.రామరాజు జయంతి నీ ఈవిధంగా జరుపుకోవటం చాలా ఆనందదాయకంగా ఉందని తెలిపారు. 2వ వార్డు ప్రధాన కార్యదర్శి శిరపు. రామలక్ష్మి మాట్లాడుతూ మన్యం ప్రజల్లో రాజు తెచ్చిన చైతన్యం వారి కష్టాలను కడతేర్చటానికి తెల్ల దొరల దోపిడీ ని ఎదుర్కోటానికి సీతారామరాజు చేసిన సేవ ఎనలేనిది కేవలం 27ఏళ్ళ వయసులోనే సీతరామ రాజు దేశం కోసం అమరవీరుడయ్యారు.స్వాతంత్ర్య సమర యోధుల్లో అల్లూరి సీతారామరాజు ఒక్కరు. అని అన్నారు. ఈ కార్యక్రమం లో పెదగాథ. విజయ రేఖ కరుణ, ఆదర్శనగర్ కాలనీ వాసులు హాజరయ్యారు. అలాగే ఆనందపురం బి.జె.పి మండల పార్టీ అధ్యక్షుడు మీసాల రాము నాయుడు బిజెపి కిసాన్ మోర్చా విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి,పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్, బిజెపి సీనియర్ నాయకులు, ఉప్పాడ అప్పారావు, కోరాడ శంకరరావు ఆధ్వర్యంలో అల్లూరి సీతా రామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు, చరిత్ర చిరకాలం గుర్తుండి పోయే విధంగా అల్లూరి సీతా రామరాజు జయంతి ఈవిధంగా జరుపుకోవటం చాలా ఆనంద దాయకంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం బిజేపి కార్యవర్గ సభ్యులు,%హా%.దుర్గ రావు,పిల్ల చిన్నారావు, బిజెపి కార్యకర్తలు హాజ రయ్యారు.

## లబ్ధిదారులతో స్నేహభావంతో మెలగాలి



కంచరపాలెం : వార్డు సచివాలయాలకు పలు సేవలు వినియోగించుకునేందుకు వస్తున్న ప్రజల పట్ల సచివాలయం సిబ్బంది స్నేహ భావంతో మెలగాలని జీవీఎంసీ జోన్ - 5 కమి షనర్ మల్లయ్య నాయుడు సూచించారు. ఈ మేరకు జీవీఎంసీ 53 వ వార్డు పరిధి గ్రీన్ గార్డెన్స్ వద్ద నున్న 295 సచివాలయాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. లబ్ది దారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. లబ్ది దారులకు అందిస్తున్న జగనన్న చేయుత, వాహన మిత్ర తది తర పథకాలు అమలుపై అడిగి తెలుసు కున్నారు.

వివిద పథకాలకు లబ్ధిదారులు అంద జేస్తున్న దరఖాస్తులు ఒకటి రెండు సార్లు సరిచూడాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పాతమల్లంపేటలో విత్తనాలు పంపిణీ



గొలుగొండ : గొలుగొండ మండలం పాతమల్లంపేటలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి, ఆనంద్, అగ్రికల్చర్ అసి స్టెంట్ గోవింద్, వార్డు నెంబర్లు రైతులు పాల్గొన్నారు.

## సమాజ ప్రగతిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయం


**అరకు ఎమ్మెల్యే ఫాల్గుణ**




కొయ్యూరు : అరకు ఎంపి గొడ్డేటి మాధవి భర్త, నేనుసైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసిరెడ్డి శివప్రసాద్ ఆధ్వర్యంలో అరకు నియోజకవర్గంలో అరకులోయ ఆర్అండ్బి గెస్ట్ హౌస్లో అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అధ్యక్షతన పాత్రికేయ మిత్రులకు సుమారు 70 మందికి 25 కేజీల బియ్యం, కేజీ ఆయిల్ ప్యాకెట్, కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు, గోధుమ నూక, ఇడ్లీ నూక, సబ్బు, సర్ఫ్ తదితర సరుకులు పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయం నుండి నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అరకు ఎంపీ దంపతులకు ముందుగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కరోనా సమయంలో పాత్రికేయ మిత్రులనుఆదుకోవడం మంచి విషయ మన్నారు. రాబోయే రోజుల్లో కూడా తాము కూడా సహకరిస్తామన్నారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు గొడ్డేటి దేముడు ఆశయాలకు అనుగుణంగానే సేవా కార్యక్రమాలు చేపడుతున్నమన్నారు. సమాజ ప్రగతిలో విలేకరుల పాత్ర అమోఘమని, ప్రశంసనీయమన్నారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న వేళ ప్రాణాలు సైతం పణంగా పెట్టి సేవలందిస్తున్న ఫ్రంట్ లైన్ వారియర్స్ అయిన మీడియా ప్రతినిధులను నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూత నదించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు, శేఖర్, సురేష్ పట్నాయక్, పృధ్వీ, గౌరీ, నాయుడు మాజీ సర్పంచులు, విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ఇంట్లో చోరీ...





కంచరపాలెం : నగరంలో కానిస్టేబుల్ ఇంట్లో చోరీ చోరి జరిగింది. సుమారు 8 తులాల బంగారం,10తులాల వెండి,13 వేల నగదు దొంగతనం గురికావడంతో బాదితుడు పోలీసు లకు పిర్యాదు చేశాడు.ఘటనకు సంబందించి వివరాలు ఇలా ఉన్నాయి . ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంగల రావు పేట లో నివాసముంటున్న టి.రాజు చేపల ఉప్పాడలో ఉన్న తన సోదరుడు ( కానిస్టేబుల్ ) ఇంటికి ఈ నెల 03 న వెళ్లి తిరిగి ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. ఈక్రమంలో ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్ళి చూశాడు. దీంతో 7 .1/2 తులాల బంగారం,10తులాల వెండి,13 వేల నగదు దొంగతనం జరిగి నట్లు గుర్తించి ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# దేశం గర్వించదగ్గ వీరుడు - ధీరుడు మన అల్లూరి

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



భీమునిపట్నం : విప్లవజ్యోతి, మన్యం వీరుడు, అల్లూరి సీతారామ రాజు 124వ జయంతిని పురస్క రించుకుని తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ కమిటీ మరియు ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు భీమిలి గ్రంధాలయం ఆవరణలో ఉన్న శ్రీ అల్లూరి సీతారామరాజు పార్క్ వద్ద మాజీ కౌన్సిలర్ చురకల రమణ, కొక్కిరి నూకరాజు, కొక్కిరి కాశీడు,, జరజాపు అచ్చిబాబు సంయుక్తంగా అల్లూరి సీతారామరాజు నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడమైనది. ఈ సందర్భంగా ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి భీమిలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర తదితర పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు చేతులమీదుగా సర్టిఫికెట్ లను పంపిణీ చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గంటా నూకరాజు మాట్లా డుతూ బ్రిటిష్ వారు మన దేశాన్ని ఆక్రమించడం, మన దేశ సంపదను దోచు కోవడమే కాకుండా భారతీయుల్ని భానుసలుగా చేసి హింసించేవారని గంటా నూక రాజు అన్నారు. భారతీయులు పడుతున్న కష్టాలను చూసి అల్లూరి సీతారామరాజు చదువుకు ఫుల్ స్టాప్ పెట్టి విల్లుపట్టి బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసి వీరోచితంగా పోరాడి ఆంగ్లేయులకు కంటిమీద కునుకులేకుండా చేసిన వీరుడు - ధీరుడు మన అల్లూరి సీతారామరాజు అని అన్నారు. ఇలాంటి మహానుభావుడు మన జిల్లాలో జన్మించడం, ఆయన తిరగాడిన ఈ నేలపై మనం జీవించడం పూర్వజన్మ సుకృతమని గంటా నూకరాజు అన్నారు. ప్రతీ ఒక్కరు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని చెడుని ఖండించి, మంచిని ప్రోత్సహించి, అవసరమనుకుంటే మన హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసి దేశానికి గర్వకారణంగా నిలవాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హిందీ దేశ భాష - రాజ భాష అని పరిచయం చేసి ప్రతీ విద్యార్థినిలో హిందీ యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ స్ఫూర్తి నింపి పరీక్షలు నిర్వహిస్తున్న ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాస్టర్ ని గంటా నూకరాజు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాసరపు నాగరాజు, కొక్కిరి అప్పన్న, , అప్పికొండ నూకరాజు, గండిబోయిన పోలిరాజు, దౌలపల్లి హరీష్, వాడమొదలు రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాధవ యువజన సమాజం ఆధ్వర్యంలో

# ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు



కంచరపాలెం : గిరిజనుల అభ్యున్నతికి మన్యం వీరుడు కీర్తిశేషులు అల్లూరి సీతారామ రాజు చేసిన సేవలు ఎనలేనివి శ్రీ మాధవ యువజన సమాజం అధ్యక్షులు సనపల బంగారు రాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆదివారం శ్రీ మాధవ యువజన సమాజ గ్రంథాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని పోరాడారని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించే వారని చెప్పారు. నేటి యువత అల్లూరి సీతారామరాజు ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పూజారి మధుసూదన రావు, ఉపాధ్యక్షులు కంచరాన సూర్యనారాయణ, కార్యదర్శి సనపల కీర్తి, సహాయ కార్యదర్శి పప్పల గౌరీ శంకర్ రావు, కోశాధికారి సనపల శ్రీకాంత్, కమ్యూనిటీ హాల్ చైర్మన్ పేడాడ పాండురంగారావు, కార్యవర్గ సభ్యులు సనపల వరప్రసాద్, నంబాల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 8వతేదన వైయస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా

### వైయస్ విగ్రహంను శుభ్రపరిచిన 35వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



విశాఖపట్నం : ఈనెల 8వతేదన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వరుయులు దివంగత మహా నేత వైయస్ రాజశేఖర రెడ్డి జయంతి రైతు దినోత్సవం సందర్భంగా ప్రతి వార్డు లో ఒక పండగల చేయాలి అని 35వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి రాజశేఖర రెడ్డి విగ్రహం శుభ్రపరిచడం జరిగింది.

# పేదల కలను సాకారం చేసే జగనన్న గృహ నిర్మాణ పనులకు శ్రీకారం



పరవాడ : పరవాడ గ్రామంలో వై.ఎస్.ఆర్ జగనన్న గృహ నిర్మాణ పనులకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ శంకుస్థాపన చేశారు. లబ్దిదారులను చైతన్యవంతం చేసి, త్వరగా ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అదీవారము పరవాడ పరిధి లో 449 మంది ఇళ్ళు లేని నిరుపేదలకు పరవాడ లే అవుట్ లో 11.22 ఎకరాల లో అతి పెద్ద వై.ఎస్.ఆర్. జగనన్న కాలనీ లే అవుట్ లో ఇళ్ల స్థలలు కేటాయించారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇళ్లను కూడా మంజూరు చేయడంతో మెగా గ్రౌండింగ్ మేళాలో తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లను నిర్మించుకునేందుకు ఆదివారం వందలాది గా తమ కుటుంబాలతో తరలి వచ్చారు. దీనితో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది అన్నారు. తమ స్థలాల్లో సంప్రదాయ బద్ధంగా నూతన వస్త్రాలు ధరించి భూమి పూజ లో పాల్గొనడంతో పరవాడ కళ కళ లాడింది అన్నారు. పేదవాడికీ సొంతింటి కలను నెరవేర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగానే రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలనూ కల్పించి, మోడల్ టౌన్ షిప్‌గా అభివృద్ది చేస్తామన్నారు. ఈ లేఅవుట్‌లో 4 బోర్లను తవ్వించి, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నీటిని సరఫరా చెయ్యటం జరుగుతుంది అని చెప్పారు. ఈ లేఅవుట్ లోని జగనన్న కాలనీ ని భవిష్యత్తులో ఒక పెద్ద నగరంగా అభివృద్ది చెందుతుందని, దీనికోసం ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. ఈ య కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ ప్రత్యేక అధికారి హేమలత, రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ అభ్యర్థి పి.ఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, పెందుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, వెన్నలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, వెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు ,మాజీ అర్ ఇసియస్ చైర్మన్ చల్ల కనకరావు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి శేఖర్, పరవాడ మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ కోన రామారావు, బంధం నాగేష్, బొద్దపు చిన్నారవు, గ్రామ సర్పంచ్ లు, ఎంపీటీసీ అభ్యర్థిలు, ప్రభుత్వ అధికారులు, హౌసింగ్ డిఇ ఎవివియస్ ఎన్ రాజు, పరవాడ తహసీల్దార్ బి.వి రాణి, పరవాడ ఎమ్ పిడిఒ హేమ సుందరరావు, ఇఒఅర్ డిపద్మజ, పరవాడ మండల హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ ఏద్ది రాజు, హౌసింగ్ ఏఇ ఎమ్ యస్ ఎన్ రెడ్డి, అర్ డబ్లూయస్ షణ్ముఖ, అర్ ఇసియస్ ఎఇ శేష సాయి, పరవాడ అగ్రికల్చర్ ఎఒ చంద్రవతి , పరవాడ ఎమ్ ఈ ఒ సునీత, ఎపిఒభాగ్య లక్ష్మి , ఎపిఎమ్ సాయి రమేష్, పిఅర్ అండ్ ఎఇ గండి రామారావు , యస్ యస్ ఎ ఎఇ రత్నం , పరవాడ పంచాయతీ కార్యదర్శి అచ్చుత రావు, గ్రామ సచివాలయం సిబ్బంది మరియు గ్రామ వాలంటీర్ లు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి : సీపీఐ నిరసన దీక్ష

- గృహనిర్బంధంతో ఉద్యమాన్ని ఆపలేరు - సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు



కాకినాడ : పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని,2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కమిటీ నాయకత్వంలో జిల్లా కార్యదర్శి తాటిపాక మధు,జిల్లా కార్యవర్గ సభ్యులు జుత్తుక కుమార్,తోకల ప్రసాద్,నక్క కిషోర్ గృహ నిర్బంధం చేయడంతో మధు నివాసం వద్ద ఉదయం 8 గంటల నుండి నిరసన దీక్షను ప్రారంభించారు.ఈసందర్భంగా మధు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పోలవరం నిర్వాసితుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని అన్నారు.పోలవరం జాతీయ ప్రాజెక్టు వేగంగా కట్టాలని తప్ప ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులను గోదావరిలో ముంచడం న్యాయం కాదన్నారు.13జిల్లాలకు సాగు,తాగు నీటితోపాటు 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనకు తోడ్పాటు అందిస్తున్నా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల రెండు లక్షల మంది నిర్వాసితులు అవుతున్నారని వారిని ఆదుకునే బాధ్యత నుంచి పాలకులు తప్పుకోవడం దారుణం అన్నారు.

విజయవాడలో జరిగే నిరసన దీక్షను గృహ నిర్భందాలు ద్వారా పోలీసులు జిల్లాలో రాజమహేంద్రవరం, రామ చంద్రపురం, ముమ్మిడివరం, సామర్లకోట, రంపచోడవరం ప్రాంతాల నాయకులను అరెస్టు చేయడాన్ని సిపిఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించుకుండా ఏఐటీయూసీ నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం హక్కులను కాలరాయడం అన్నారు.

# ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి పాత్రికేయులు

విశాఖపట్నం : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి పాత్రికేయులని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వై శివ నాగేంద్ర రెడ్డి అన్నారు. పెదవాల్తేరు లో కరోనా కష్టకాలంలో ఆదాయం లేక ఇబ్బందులకు గురవుతున్న కొంతమంది పాత్రికేయులకు నిత్యావసరాలు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వై శివ నాగేంద్ర రెడ్డి,వైసీపీ యువజన నాయకుడు గేదెల నాగరాజులు హాజరై పంపిణీ చేసారు.గేదెల నాగరాజు మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పాత్ర మరువలేనిదన్నారు. నైట్ షెల్టర్ మేనేజర్ మురళి మాట్లాడుతూ నైట్ షెల్టర్ అభివృద్ధికి సహకరించాలని గేదెల నాగరాజును అభ్యర్ధించారు.ఆ పంపిణీకి ఆర్ధిక సహాయం చేసిన రత్నప్రసాద్,దీప్య లు మాట్లాడుతూ అవకాశమున్న ప్రతీ ఒక్కరూ ఇతరులకు సహాయం చెయ్యడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజర్ రావు పాల్గొని పంపిణీకి సహకరించారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



గాజువాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని గాజువాక బీజేపీ కన్వీనర్ కర్ణంరెడ్డి నర్సింగరావు పిలుపునిచ్చారు. బీజేపి రాష్ట్ర అద్యక్షుల సోము వీర్రాజు పిలుపు మేరకు భారతీయ జన్ సంఘ్ పార్టీ వ్యవస్థాపక అద్యక్షులు డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాలలో భాగంగా బీజేపి గాజువాక నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు ఆద్వర్యంలో సిరసపల్లి నూకరాజు అధ్యక్షతన బీజేపి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి సూర్యనారాయణరాజు ముఖ్య అతిదిగా పాల్గొని గాజువాక జగ్గు జంక్షన్ వద్ద గల అమరావతి పార్కు లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ సమగ్రత సమైఖ్యత కోసం ప్రాణాలర్పించిన గొప్ప నేత డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని, ఒక దేశంలో ఒకే జెండా, ఒకే ప్రధాని, ఒకే రాజ్యాంగం ఉండాలి కాని, ఇద్దరు ప్రదానులు రెండు జెండాలు రెండు రెండు రాజ్యాంగాలు ఉండకూడదనే నినాదంతో పోరాటం చేసారని, ఆయన ఆశయ సాదనకోసం నేటి ప్రదాని మోదీ ఆర్టికల్ 370 రద్దుపరిచి భారతదేశం లో ఒకే జెండా ఒకే ప్రదాని ఒకే రాజ్యాంగం ఉండేలా చేశారని చెప్పారు.

కె ఎన్ ఆర్ మాట్లాడుతూ భారతీయ జన్ సంఘ్ పార్టీ 1951 లో ఆయన స్థాపించారని అది జనతా పార్టీ గాను అనంతరం భారతీయ జనతా పార్టీ గా రూపాంతరం చెంది నేడు ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ గా 14 కోట్ల సభ్యులున్న పార్టీ గా ఎదిగిందని, ప్రదాని నరేంద్ర మోదీ నాయ కత్వంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి , దేశ ప్రగతికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా గాజువాక లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్టు ప్రాంగణంలో ఉదయం 8.15 గం.లకు మొక్కులు నాటే కార్య క్రమానికి డిల్లీ నుండి జాతీయ ప్రదాన కార్య దర్శి ఎం పి అరుణ్ సింగ్ రాష్ట్ర అద్యక్షులు సోము వీర్రాజు ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాదవ్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి సూర్యనారాయణ రాజు, జిల్లా అద్యక్షులు మేడపాటి రవీంధ్ర తది తరులు పాల్గొం టారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోలి.శంకరరావు, కృష్ణంరాజు, రోహిణి, వర్రి లలిత, ముస లయ్య, పుష్పలత, పేర్ల అప్పారావు, ప్లీడర్ అచ్యుతరావు, కరాటే శరత్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకి ఎంతో ఇష్టమైన ప్రముఖ టీవీ షో సెల్ఫీ విత్ బజరంగి

# కొత్త టైటిల్ సాంగ్ రిలీజ్ చేసిన కాస్మోస్ మాయ

విశాఖపట్నం : సూపర్ హిట్ షో "సెల్ఫీ విత్ బజరంగీ" కు సరికొత్త టైటిల్ సాంగ్ రిలీజ్ చేసిన కాస్మోస్ మాయ. ఈ షో యొక్క తర్వాత సీజను త్వరలో ప్రసారం కానుంది. సినిమా పరిశ్రమలో దిగ్గజాలైన సమీర్ అంజాన్ %డ% రాజు సింగ్ ఈ కొత్త టైటిల్ సాంగ్ ను వ్రాయడం మరియు కంపోజ్ చేయడం జరిగింది. ఈ సరికొత్త సీజన్ మరియు టైటిల్ సాంగ్ హిందీ, తెలుగు, తమిళ భాషలలో రానుంది. హిందీ వెర్షన్ పాట బాలీవుడ్ ప్రముఖ గాయకుడు షాన్ ఆలపించనున్నారు. ఈ సందర్భంగా కాస్మోస్ మాయ వ్యవస్థాపకులు చేతన్ మెహతా మాట్లాడుతూ " సెల్ఫీ విత్ బజరంగీ" టీవీ షో పిల్లలకి ఎంతో ఇష్టమైనది గా మారింది. ప్రతి చిన్న పిల్లడు బజరంగీ వంటి స్నేహితుడు తమ వెంట ఉండాలని తమకు సాయం చేయాలని కోరుకుంటాడు. పిల్లలకు అర్థమయ్యే విధంగా కథలు చెప్పే విధానం లో ఈటీవీ షో రూపొందించబడింది. తొమ్మిది సంవత్సరాల పిల్లవాడు అంకుష్ బజరంగీ తో(హనుమంతుడు శక్తి) గల పిల్ల వాడితో స్నేహం చేస్తాడు. వారు చేసే పనులు ఈ షో లో యానిమేషన్ తో చూపబడ్డాయి" అని అన్నారు అనీష్ మెహత, సీఈవో కాస్మోస్ మాయ మాట్లాడుతూ" ఈ షో ప్రముఖ కార్టూన్ సీరియస్ గా మారింది, అలాగే పిల్లలు బొమ్మలు మరియు బట్టలు అమ్మకానికి ఆలోచిస్తున్నాం" అని అన్నారు. ధీరజ్ బెర్రీ చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్‌షో క్రియేటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ" అంకుష్ ఔర్ బజరంగీ దోనో హై నంబర్ వన్ అనే పాట రెండు పాత్రల మధ్య సంబంధాన్ని వివరిస్తుంది. రాబోయే రెండవ సీజన్ ఎపిసోడ్ పిల్లలకు మరింత నచ్చుతుందని" అని అన్నారు. ప్రఖ్యాత గాయకుడు, సెల్ఫీ విత్ బజరంగీ టైటిల్ ట్రాక్ పాడిన గాయకుడు షాన్ మాట్లాడుతూ" పిల్లలు యానిమేటెడ్ కార్టూన్స్ నాకు ఇష్టం సెల్ఫీ విత్ బజరంగి కొత్త సీరియల్ టైటిల్ ట్రాక్ పాడటం సమీర్ మరియు రాజు సింగ్ తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ పాట ఎంతో సరదాగా ఉంటుంది పిల్లలకు మరింత నచ్చుతుంది' అని అన్నారు.

# రక్త నిల్వల కొరకు యువత విరివిగా రక్తదానం చేయండి

- కళా హాస్పిటల్లో మెగా రక్తదాన శిబిరం
- మహిళలు రక్తదానం చేయడం అభినందనీయం
- పలువురు మహిళలకు పౌష్టికాహారం (ప్రోటీన్ పౌడర్) పంపిణీ
- రక్తదాతలకు అభినందనలు తెలియజేసిన కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి



విశాఖ సిటీ : ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రైవేట్ కేజీహెచ్ గా పేరుగాంచిన ప్రముఖ వైద్యాలయం కళా హాస్పిటల్ లో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. నగరానికి చెందిన రోటరీ బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యం తో, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అబ్దుల్ సహాయ సహకారాలతో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి తెలియజేశారు. గత కొంత కాలంగా కరోనా నేపథ్యంలో నగరంలోని అన్ని బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు లేని కారణంగా అత్యవసర సమయంలో రోగులకు వైద్యం చేసే సమయంలో రక్తం అందక కొన్ని సందర్భాలలో ప్రాణనష్టం కూడా జరుగుతోందని డాక్టర్ పివీ రమణమూర్తి తెలియజేశారు. ఈ తరుణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి ఈ రక్తదాన కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో పలువురు మహిళలు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం గమనార్హం. అనంతరం పలువురు మహిళలకు ప్రోటీన్ పౌడర్ ( పౌష్టికాహారం ) పంపిణీ చేశారు. రక్త దాతలకు బ్లడ్ డొనేషన్ పత్రాలను అందజేశారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో డాక్టర్ పి వి రమణమూర్తి తో పాటు డాక్టర్ పైడి కళావతి, డాక్టర్ పైడి సాకేత్, వ్యాపారవేత్త పుష్కర్ గణేష్, గోదావరి రెడ్డి సంక్షేమ సంఘం సలహాదారుడు వెంకటరెడ్డి (ఎన్), హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్ ( యూత్ విభాగం) మానేపల్లి సుగుణ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్ర భారత్, వైకాపా స్టేట్ బీసీ సెల్ సెక్రటరీ బెవర మహేష్, లండ రమణ, నాగుల సతీష్, నర్సింగ్, రమేష్, ప్రసాద్, రాయితీ సతీష్, అలీ, మరియు రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ జీ.ఎస్ రాజు, ప్రతినిధులు అశోక్ కుమార్, పి ఆర్ వో రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన అనిల్ కుంబ్లే



తాడేపల్లి: టీమిండియా మాజీ కోచ్, దిగ్గజ స్పిన్ బౌలర్ అనిల్ కుంబ్లే.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. సోమవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన.. సీఎం వైయస్ జగన్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో ఇరువురి మధ్య క్రీడల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఏపీలో స్పోర్ట్స్ యూనివర్శిటీ, క్రీడా సామగ్రి తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఇరువురు చర్చించారు. ఈ రెండు ప్రాజెక్ట్‌ల ఏర్పాటుపై దృష్టి సారించాలని, దీనికి తన వంతు సహకారం అందిస్తానని కుంబ్లే సీఎంకు తెలిపారు. క్రీడా సామగ్రి తయారీ ఫ్యాక్టరీలు ప్రస్తుతం జలంధర్, మీరట్ లాంటి నగరాల్లో మాత్రమే ఉన్నాయని, అక్కడి నుంచే అన్ని రకాల క్రీడా సామగ్రి సరఫరా జరుగుతుందని కుంబ్లే.. సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఏపీలో ఫ్యాక్టరీ పెడితే అందరికీ అందుబాటులో క్రీడా సామగ్రి ఉంటుందని ఆయన సీఎంకు వివరించారు. టీమిండియాకు టెస్ట్ కెప్టెన్‌గా, ప్రధాన బౌలర్‌గా వ్యవహరించిన అనిల్ కుంబ్లే.. భారత జట్టు ప్రధాన కోచ్ సహా బీసీసీఐలో పలు ఉన్నత పదవులు చేపట్టాడు.

# సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం :- మహా విశాఖ నగరపాలక సంస్థ నాలుగవ జోన్ పరిధిలోని భీమ్ నగర్ లో ఉన్న 210, 212, టీఎస్ఆర్ కాంప్లెక్స్ లో 214, 215 ఉన్న వార్డు సచివాలయాలను సోమవారం జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ కార్యదర్శులు హాజరు పట్టి, వారి జాబ్ చార్టును, డైరీని, ప్రజలు పెట్టుకున్న అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే అన్ని సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో వార్డు సచివాలయ వ్యవస్థ ను ప్రవేశ పెట్టడం జరిగిందని, దానిని కార్యదర్శులు నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని తెలిపారు. కార్యదర్శులు వారి జాబ్ చార్టు అధాఎఅమ్మా విధులు నిర్వహించాలని చేసిన పనిని వెంటవెంటనే డైరీలో పొందుపరచాలని, బయటకు విధులు నిర్వర్తించుటకు వెళ్ళినప్పుడు మూమెంట్ రిజిస్టర్ లో పూర్తి వివరాలు వ్రాయాలని, కార్యదర్శులు సచివాలయంలో ఉండి ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను, అర్జీలను పెండింగులో ఉంచకుండా వెంటనే నమోదు చేసి పై అధికారికి పంపాలని, శానిటరీ కార్యదర్శులు కనీసం మూడు గంటలు వార్డులో పర్యటించి డోర్ టు డోర్ చెత్త సేకరణ, కాలువలు, రోడ్డు శుభ్రం చేయించాలని తెలిపారు.

ఏ వార్డులో ఉండవలసి సచివాలయాలు అదే వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని జోనల్ కమిషనర్ బి.వి.రమణ ను ఆదేశించారు.



# తప్పుడు వార్తలు రాసేవారిపై పరువు నష్టం దావా వేస్తాం

## పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది



అమరావతి : విశాఖ జిల్లాలో బాక్సైట్ మైనింగ్‌కు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదని పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. 2010 నుంచి 2014 వరకు లేటరైట్‌కు ఆరు లీజులిచ్చారని, కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " 5 మెట్రిక్ టన్నుల మైనింగ్ చేస్తే రూ.15వేల కోట్ల స్కామ్ ఎలా జరుగుతుంది?. తప్పుడు వార్తలు రాస్తూ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. తప్పుడు వార్తలు రాసేవారిపై పరువు నష్టం దావా వేస్తాం. జగనన్న కాలనీలకు ఎక్కడా ఇసుక కొరత లేదు. రోజూ 2లక్షల టన్నుల ఇసుక ఉత్పత్తి చేస్తున్నాం. 40 కి.మీ.లోపల ఉన్నవారు ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చు" అని అన్నారు

## యువతను ప్రోత్సహించడంలో

# డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ పాత్ర అమోఘం

- డిప్యూటీ మేయర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న వైకాపా యువ నాయకుడు నంబాల రాజేష్ కుమార్




ఎన్.ఏ.డి కొత్త రోడ్డు : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ ను సోమవారం ఎన్ఏడి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రెటరీ నంబాల రాజేష్ కుమార్. అనంతరం పలు విషయాలపై కొంతసేపు చర్చించుకున్నారు.

ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఐకాన్ గా పేరుగాంచిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీ స్థాపించిన నాటి నుండి ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీలో చేరిన నాకు అప్పటినుంచి నా సోదర సమానులైన జియ్యని శ్రీధర్ స్థానికంగా పార్టీలో ఎన్నో విధాలుగా తనకు సహకరించారని రాజేష్ కుమార్ తెలియజేశారు. ప్రస్తుతం మహానగరానికి డిప్యూటీ మేయర్ స్థాయిలో ఉన్న జియ్యని శ్రీధర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నప్పుడు అదే అనురాగం, అదే ఆప్యాయతతో పలకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకోవడం ఆయన మంచి తనానికి నిదర్శనమని రాజేష్ కుమార్ అన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలి

- రాష్ట్ర పురపాలక శాఖామంత్రి బొత్స సత్యనారాయణ
- 12 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన చీపురుపల్లిలో మోడల్ డిగ్రీ కళాశాల ప్రారంభం



చీపురుపల్లి (విజయనగరం) : విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, దానిని సాధించేందుక కృషి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రతీ విద్యార్థికి జీవితంలో ఒక లక్ష్యం ఉండాలని ఆయన సూచించారు. చీపురుపల్లిలో సుమారు రూ.12కోట్ల వ్యయంతో నిర్మించిన మోడల్ డిగ్రీ కళాశాల, హాస్టల్ భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారయణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతిస్తున్న అంశాల్లో విద్యారంగం ఒకటని అన్నారు. విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులను ప్రవేశపెట్టిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. నాడూ-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలే పూర్తిగా మారిపోయాయని, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా తయారు చేయడం జరిగిందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో పేద ప్రజలు విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో, ప్రభుత్వం విద్యాకానుక, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన మొదలగు పథకాలను అమలు చేస్తూ, విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులు బాగా చదివి, ఉన్నత స్థానానికి ఎదగాలని మంత్రి కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి పెనుమత్స సురేష్‌బాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరి జవహర్ లాల్, ఉన్నతవిద్య ఆర్‌జెడి డాక్టర్ టి.కృష్ణ, వైకాపా జిల్లా రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రూపవాణి, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## 'లెత (LETHA) ఛారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో

# నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన మేయర్




విశాఖపట్నం :- "లెత (LETHA) చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట చేతుల మీద పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. సోమవారము 2వ జోన్ 12వ వార్డు లోని నెహ్రూ నగర్ లో అరవై పేద కుటుంబాలకు రూ.2500 లు విలువ చేసే సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కరోనా వలన చాలా పేద కుటుంబాలకు పనులు లేక రోడ్డున పడుతున్నారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనపైన ఉందని తెలిపారు. పేద కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన లేదా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శివారెడ్డిని ఆమె అభినందించారు. నిరుపేదలను ఆదుకోవడానికి మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మేయర్ పిలుపు నిచ్చారు. చారిటబుల్ ట్రస్ట్ లకు ప్రభుత్వం తరఫున సహకారం అందించడానికి తాము ముందుంటామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో "లెత (LETHA) చారిటబుల్ ట్రస్ట్" సభ్యులు శివారెడ్డి, వార్డ్ కార్పొరేటర్ అక్రమాని

రోహిణి, వైసిపి వార్డ్ అధ్యక్షులు సుబ్బారెడ్డి, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

# థియేటర్లు రీఓపెన్...

తాడేపల్లి: సినీ ప్రియులకు గుడ్‌న్యూస్. ఎప్పుడెప్పుడు థియేటర్లు ఓపెన్ అవుతాయా అని ఎదురుచూస్తున్న సినీ ప్రేక్షకులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త అందించింది. జులై 8వ తేదీ నుంచి 50 శాతం ఆక్యుపెన్సీతో థియేటర్లు నడిపించవచ్చని ప్రభుత్వం పేర్కొంది. కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గతేడాది కూడా కరోనా కారణంగా వేల కోట్ల నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. సినీ పరిశ్రమను కోలుకోలేని దెబ్బ తీసింది ఈ మాయదారి వైరస్. అయితే కేసులు తగ్గిపోతున్న తరుణంలో అన్‌లాక్ ప్రక్రియలో భాగంగా థియేటర్లు తెరుచుకున్నాయి. అయితే అది కూడా మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది. అలా థియేటర్లు ఓపెన్ అయిన రెండు, మూడు నెలలకే కరోనా సెకండ్ వేవ్ విజృంభించింది. దీంతో దాదాపు అన్ని రాష్ట్రాల్లో లాక్‌డౌన్ విధించక తప్పని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కోవిడ్ తగ్గుముఖం పడుతుండటంతో థియేటర్ల అనుమతికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే వాయిదా పడిన సినిమా షూటింగులు కొద్ది రోజుల నుంచి జోరందుకున్న సంగతి తెలిసిందే.మరోవైపు తెలంగాణలో ఇప్పటికే థియేటర్లకు అనుమతిచ్చినా ఎప్పటి నుంచి ఎప్పటి నుంచి అన్నదానిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. అయితే వందశాతం ఆక్యూపెన్సీతో త్వరలోనే థియేటర్ల అనుమతికి తెలంగాణ ప్రభత్వం పచ్చజెండా ఊపుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com